manavishwam.com

# మన విశ్వం

VOICE OF THE PEOPLE-POWER OF TRUTH

తెలుగు వార్తా దినపత్రిక

MANAVISHWAM TELUGU DAILY

**మంచిమాట**

మనుషులలో మార్పు సహజం. మనం ఎలా మారాలి అన్నది 'వివేకం' చెబుతుంది. ఎప్పుడు మారాలి అన్నది 'అనుభవం' చెబుతుంది. అసలు ఎందుకు మారాలి అన్నది 'అవసరం' చెబుతుంది.

వరంగల్ | సంపుటి : 01 | సంచిక : 42 | బుధవారం, జూలై 29 2026 | పేజీలు - 8 | వెల : 5/-

## తెలంగాణకు 11.56 లక్షల

# ఇళ్లు ఇవ్వండి!

- ●ప్రధానమంత్రి ఆవాస్ యోజన
- ●గ్రామీణ్ కింద కేటాయింపులు కోరిన సీఎం రేవంత్
- ●ఇందిరమ్మ ఇళ్లకు కేంద్ర సహకారం అందించాలని వినతి
- ●ఉపాధి హామీ పథకంలో కొత్త పనులు చేర్చాలని ప్రతిపాదన
- ●తెలంగాణ పర్యటనకు శివరాజ్ సింగ్ చౌహాన్‌కు ఆహ్వానం




**న్యూఢిల్లీ, జూలై 28 (మన విశ్వం):** రాష్ట్రంలోని గ్రామీణ పేదలకు గృహాలు కల్పించేందుకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన--గ్రామీణ్ కింద 11.56 లక్షల ఇళ్లను మంజూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా తెలంగాణ ఎంపీలతో కలిసి కేంద్ర మంత్రిని కలిసిన సీఎం, రాష్ట్రంలో గృహ అవసరాలు అధికంగా ఉన్నాయని వివరించారు.

మిగతా 2లో...

## టెస్ట్ ట్రాక్ లేదు...

# లైసెన్స్ ఎలా?

- ◆ములుగు ఆర్టీఏలో నిబంధనలకు తూట్లు?
- ◆లంచం ఇస్తే చాలు...
- ◆టెస్ట్ లేకుండానే లైసెన్స్‌ల జారీపై ఆరోపణలు
- ◆అర్హతలేని డ్రైవర్లతో రహదారులపై పెరుగుతున్న ముప్పు
- ◆అక్రమాలపై విచారణకు ప్రజల డిమాండ్




**ప్రత్యేక ప్రతినిధి, జులై 28(మన విశ్వం):** డ్రైవింగ్ లైసెన్స్ జారీకి ముందు అభ్యర్థి తప్పనిసరిగా డ్రైవింగ్ నైపుణ్యాన్ని నిరూపించాలి. ఇందుకోసం రవాణా శాఖ నిర్దేశించిన టెస్ట్ ట్రాక్‌పై పరీక్ష నిర్వహించి, అర్హత సాధించిన వారికే లైసెన్స్ ఇవ్వాలి. కానీ ములుగు జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో మాత్రం ఈ నిబంధనలు కాగితాలకే పరిమితమయ్యాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. టెస్ట్ ట్రాక్ లేకుండానే డ్రైవింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు అభ్యర్థులు వాహనం నడపకుండానే లైసెన్స్ పొందుతున్నారన్న ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

**టెస్ట్ ట్రాక్ ఎక్కడ?**

రవాణా శాఖ నిబంధనల ప్రకారం ప్రతి ఆర్టీఏ కార్యాలయంలో డ్రైవింగ్ పరీక్షల కోసం ప్రత్యేక టెస్ట్ ట్రాక్ ఉండాలి. అయితే ములుగు కార్యాలయంలో అలాంటి ట్రాక్ కనిపించకపోవడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ట్రాక్ లేకపోతే పరీక్షలు ఎక్కడ నిర్వహిస్తున్నారు? అభ్యర్థుల డ్రైవింగ్ సామర్థ్యాన్ని ఎలా అంచనా వేస్తున్నారు? అనే ప్రశ్నలకు అధికారులు

మిగతా 2లో...

## తెలంగాణ ముద్రతో

# టీవీ అవార్డులు!



- ●లోగో, అవార్డుల్లో తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించాలని మంత్రి కోమటిరెడ్డి ఆదేశం
- ●పీవీ నరసింహారావు పేరు పరిశీలనలో.. పారదర్శక ఎంపికకు మార్గదర్శకాలు సిద్ధం

**హైదరాబాద్, జూలై 28 (మన విశ్వం):** రాష్ట్రంలో తొలిసారిగా ప్రవేశపెట్టనున్న టెలివిజన్ అవార్డులు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఆత్మగౌరవాన్ని ప్రతిబింబించేలా ఉండాలని సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు.

మిగతా 2లో...

## నెరేళ్ల బాధితులకు

# న్యాయం చేయాలి

- ●గంధం గోపాల్ కుటుంబాన్ని పరామర్శించిన కల్వకుంట్ల కవిత
- ●బాధ్యులపై చర్యలు, బాధితులకు పరిహారం ఇవ్వాలని డిమాండ్
- ●ఎస్సీ కమిషన్ నివేదిక విడుదల చేయాలని కోరిన తెలంగాణ రక్షణ సేన చీఫ్



**రాజన్న సిరిసిల్ల, జూలై 28 (మన విశ్వం):** నెరేళ్ల ఘటనలో మృతిచెందిన గంధం గోపాల్ కుటుంబ సభ్యులను తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత మంగళవారం పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ నెరేళ్ల ఘటన తెలంగాణ సమాజం తలదించుకునే సంఘటన అని

మిగతా 2లో...

## 16 మంది మావోయిస్టుల

# సరెండర్

- ●రూ.39 లక్షల రివార్డు ఉన్న ఆరుగురు కీలక సభ్యులు



**రాంచీ, జూలై 28 (మన విశ్వం):** జార్ఖండ్‌లో మావోయిస్టులకు మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఐదుగురు మహిళలతో సహా మొత్తం 16 మంది మావోయిస్టులు మంగళవారం రాష్ట్ర రాజధాని రాంచీలో పోలీసుల ఎదుట లొంగిపోయారు. లొంగుబాటు సందర్భంగా రెండు ఏకే-47 రైఫిల్స్‌తో పాటు పలు ఆయుధాలను పోలీసులకు అప్పగించారు. లొంగిపోయిన వారిలో ఆరుగురిపై

మిగతా 2లో...

## కార్మిక ఐక్యతే బలం.. ఎన్ ఎం యూ

# విజయమే లక్ష్యం

- ■9 డిపోల నుంచి 400 మందికిపైగా కార్మికుల హాజరు
- ■యూనియన్ ఎన్నికలకు సమష్టిగా సిద్ధం కావాలని నాయకుల పిలుపు




**హన్మకొండ, జూలై 28 (మన విశ్వం):** రానున్న టీజీఎస్‌ఆర్టీసీ యూనియన్ ఎన్నికల్లో నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్‌ఎంయూ)ను విజయపథంలో నడిపించేందుకు ప్రతి సభ్యుడు ఐక్యతతో పనిచేయాలని యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. హన్మకొండలోని ఎన్‌ఆర్ కన్వెన్షన్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన వరంగల్ రీజియన్ ఎన్‌ఎంయూ సర్వసభ్య సమావేశానికి తొమ్మిది డిపోల నుంచి 400 మందికిపైగా కార్మికులు, యూనియన్ ప్రతినిధులు, నాయకులు హాజరై సమావేశాన్ని విజయవంతం చేశారు. సమావేశంలో ఎన్‌ఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మౌలానా మాట్లాడుతూ, యూనియన్ ఆవిర్భావం నుంచి కార్మిక హక్కుల పరిరక్షణ కోసం సాగించిన పోరాటాలను గుర్తు చేశారు. రానున్న ఎన్నికలు కార్మికుల భవిష్యత్తును

మిగతా 2లో...

## హైడ్రా పేరుతో అరాచకం..

# మా ప్రభుత్వం వస్తే రద్దు!

- ●బడాబాబులపై చర్యలు లేవు.. పేదల ఇళ్లపైనే దాడులు: కేటీఆర్
- ●హైకోర్టు వ్యాఖ్యలు ప్రభుత్వానికి చెంపపెట్టు



**న్యూఢిల్లీ, జూలై 28 (మన విశ్వం ప్రతినిధి):** రాష్ట్ర ప్రభుత్వం హైడ్రా పేరుతో పేదల ఇళ్లను లక్ష్యంగా చేసుకుని విధ్వంసం సృష్టిస్తోందని, కానీ చెరువులు, ఎఫ్‌టీఎల్, శిఖం భూముల్లో ఉన్న అధికార పార్టీ నేతల నిర్మాణాలపై మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి రోజే హైడ్రాను రద్దు చేస్తామని ప్రకటించారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర రైల్వే, ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసిన అనంతరం ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, దీవకొండ దామోదర్‌రావుతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నివాసం చెరువు పరిధిలో ఉందని, ముఖ్యమంత్రి సోదరుడి ఇల్లు ఎఫ్‌టీఎల్‌లో ఉందని, పలువురు కాంగ్రెస్ నేతల నిర్మాణాలు కూడా చెరువులు, శిఖం భూముల్లో ఉన్నాయని ఆరోపించారు. అయితే

మిగతా 2లో...

బుధవారం,
జూలై 29, 2026

మన విశ్వం
VOICE OF THE PEOPLE-POWER OF TRUTH
తెలుగు వార్తా దినపత్రిక



# సంపాదకీయం

## హైదరాబాద్‌లో ఫేక్ కాల్ సెంటర్ స్కామ్

- కోట్ల రూపాయాల సైబర్ మోసం
- కీలక నిందితుడిని అరెస్ట్ చేసిన ఇడి



**హైదరాబాద్,జూలై28:** హైదరాబాద్ కేంద్రంగా నడిచిన అంతర్జాతీయ ఫేక్ కాల్ సెంటర్ స్కామ్‌లో కీలక నిందితుడిని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు అరెస్ట్ చేశారు. ప్రధాన సూత్రధారి వికాస్ కుమార్ నిమార్ అలియాస్ మిస్టీ.. అమెరికా పౌరులను లక్ష్యంగా చేసుకుని కోట్ల రూపాయల సైబర్ మోసానికి పాల్పడ్డాడు. దీంతో వికాస్‌ను ఈడీ అధికారులు అదుపులోకి తీసుకుని వైద్య పరీక్షల నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఫేక్ కాల్ సెంటర్‌కు సంబంధించి మాదాపూర్ పోలీసులు నమోదు చేసిన కేసు ఆధారంగా మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఈడీ అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఇంటర్‌పోల్ ద్వారా అమెరికా ఎంబసీ అందించిన సమాచారంతో సీబీఐ గతంలోనే కేసు నమోదు చేసింది. 2023లో ఈసీఐఆర్ నమోదు చేసి మనీలాండరింగ్ కోణంలో ఈడీ అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. హైదరాబాద్, విశాఖపట్నం, లఖ్‌నవూతో పాటు పలు నగరాల్లో నకిలీ కాల్ సెంటర్లను వికాస్ నిర్వహించాడు. ఈ ముఠా.. టెక్నికల్ సపోర్ట్ పేరుతో విదేశీయులను నమ్మించి భారీ మొత్తంలో డబ్బు కాజేసింది. ప్రభుత్వ సంస్థలు, ప్రముఖ ప్రైవేట్ కంపెనీల అధికారులమంటూ బాధితులకు ఫోన్ కాల్స్ చేసి నిందితుడు బెదిరింపులకు పాల్పడినట్లు విచారణలో బయటపడింది. వికాస్.. కంప్యూటర్ వైరస్‌లు, బ్యాంక్ ఖాతా సమస్యలు, సెక్యూరిటీ అలర్ట్‌ల పేరుతో అమెరికన్లను భయపెట్టి డబ్బు వసూలు చేశాడని.. గిఫ్ట్ కార్డులు, డిజిటల్ పేమెంట్ల రూపంలోనూ బాధితుల నుంచి నగదు సేకరించినట్లు దర్యాప్తులో తేలింది. సేకరించిన డబ్బును క్రిఎ÷–టోకరెన్సీగా మార్చి ఆధారాలు లేకుండా ప్రయత్నించినట్లు ఈడీ అధికారులు గుర్తించారు. క్రిఎ÷–టో ఆస్తులను ఎక్స్ఛేంజ్‌లు, హవాలా తరహా నగదు సెటిల్‌మెంట్ నెట్‌వర్క్‌లు, బ్యాంకింగ్ మార్గాల ద్వారా భారత కరెన్సీగా మార్చినట్లు విచారణలో బయటపడింది. వీసీ సొల్యూషన్స్ పేరుతో కంపెనీ ఏర్పాటు చేసి మోసపూరిత డబ్బును చట్టబద్ధ ఆదాయంగా చూపించే ప్రయత్నం చేసినట్లు అధికారులు తెలిపారు. వీసీ సొల్యూషన్స్ బ్యాంక్ ఖాతాల్లో భారీ నగదు డిపాజిట్లు, అనుమానాస్పద క్రెడిట్ లావాదేవీలను గుర్తించారు. ఃాల్ సెంటర్ ద్వారానే ఆదాయం వచ్చినట్లు విచారణలో నిమార్ అంగీకరించినట్లు ఈడీ అధికారులు వెల్లడించారు. అయితే ఈ డబ్బును ఆదాయపు పన్ను రిటర్న్‌లో కిరాణా వ్యాపారం, ఇతర వ్యాపారాల ఆదాయంగా వికాస్ చూపించాడని తెలిపారు. 2023లో ఈసీఐఆర్ నమోదు చేసి మనీలాండరింగ్ కోణంలో ఈడీ అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసులో మరికొందరి పాత్ర, నిధుల ప్రవాహం, క్రిఫ్టో లావాదేవీలపై దర్యాప్తు కొనసాగుతోంది.

## తుది దశకు చేరుకుంటున్న సర్

- డిజిటలైజేషన్ ప్రక్రియలో ఆలస్యం



**హైదరాబాద్,జూలై28:** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం గడువు సమీపిస్తుండగా ఇంకా స్పందించాల్సిన ఓటర్లు కూడా పెద్ద సంఖ్యలోనే ఉన్నారు. మిగిలిపోయిన వారి అడ్రస్‌లను తెలుసుకోవడానికి అధికారులు ప్రయత్నం చేస్తున్నారు. అధికారులు, సిబ్బందితో సహా అందరూ ఎన్యుమరేషన్ పత్రాల స్వీకరణపై దృష్టి కేంద్రీకరించారు. గతంతో పోలిస్తే కొంత పరిస్థితి మెరుగ్గా కనిపిస్తున్నప్పటికీ.. ఇంకా ఎన్యుమరేషన్ పత్రాలు ఇవ్వాల్సిన వారు అధికంగానే ఉండటం గమనర్హం.వాటి అందజేతకు కొందరు నిరాకరిస్తుండగా.. మరికొందరు అందుబాటులో లేకపోవడంతో డిజిటలైజేషన్ ఆశించిన స్థాయిలో ముందుకు కదలడం లేదు. ఇంటి అడ్రసులు మారిన వారు కూడా అధిక సంఖ్యలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీరికి సమాచారం అందించి ఎన్యుమరేషన్ పత్రం అందజేసేలా చర్యలు తీసుకుంటున్నారు. సర్ పక్రియ ఆగస్టు 3వ తేదీన ముగుస్తుంది. కేవలం వారం రోజులు మాత్రమే మిగిలి ఉంది. ఇంత తక్కువ వ్యవధిలో లక్షకు పైగా ఓటర్ల ఎన్యుమరేషన్ పత్రాలు తీసుకొని డిజిటలైజేషన్ చేయడం కష్టసాధ్యమనే చెప్పాలి. అందిన ఎన్యుమరేషన్ పత్రాలను యాప్‌లో అప్‌లోడ్ చేసేందుకు ప్రత్యేక కేంద్రాల్లో ముమ్మరంగా కసరత్తు కొనసాగుతుంది. ఆయా ప్రాంతాల్లో నివసిస్తున్న ఏపీకి చెందిన వారు ఎన్యుమరేషన్ పత్రాలను తిరిగి ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారు. తమ స్వస్థలాల్లో ఓటు హక్కు ఉండేలా అక్కడే పత్రాలను ఇస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇటువంటి వారి నుంచి ఆయా ప్రాంతాల్లో ఓటరు నంబర్ తీసుకొని ఆ సమాచారాన్ని యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. సర్‌లో భాగంగా వీరందరికి ఎన్యుమరేషన్ పత్రాలను జూన్ 25 వ తేదీన ప్రారంభించారు. ఈ క్రమంలో సర్ పక్రియ చివరి దశకు చేరుకుంది.

## తెలంగాణకు 11.56 లక్షల

గత ప్రభుత్వం ప్రధానమంత్రి ఆవాస్ యోజనను పూర్తిస్థాయిలో వినియోగించుకోకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల కొరత పెరిగిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన ఆవాస్ ప్లస్ సర్వేలో 11,56,915 అర్హులైన కుటుంబాలు గుర్తించబడినట్లు పేర్కొంటూ, వీరందరికీ వీలైనంత త్వరగా ఇళ్లను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.




ఉపాధి హామీలో కొత్త పనులకు ప్రతిపాదన

ఎల్‌నినో, వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అదనపు పనులను చేర్చాలని సీఎం కోరారు. ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలకు ఉపాధి లభించేలా కూరగాయల పందిళ్లు, పశుగ్రాస ప్లాట్లు, మల్బరీ తోటలు, పట్టు పురుగుల పెంపక కేంద్రాలు, వెదురు వనాల అభివృద్ధి వంటి పనులను చేర్చాలని ప్రతిపాదించారు.

అలాగే కొండ ప్రాంతాల్లో నీటి నిల్వ కందకాల నిర్మాణం, పండ్ల తోటల్లో తేమ సంరక్షణ, వరదలు, ఇసుక మేటలతో దెబ్బతిన్న భూముల పునరుద్ధరణ పనులను కూడా ఉపాధి హామీ పథకంలో చేర్చాలని సూచించారు.

ఇందిరమ్మ ఇళ్లకు 90 రోజుల ఉపాధి

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు గృహ నిర్మాణ సమయంలో ఉపాధి హామీ పథకం ద్వారా 90 రోజుల పని అవకాశాన్ని కల్పించేలా కేంద్రం సహకరించాలని ముఖ్యమంత్రి కోరారు. ఇందిరమ్మ ఇళ్లు, గ్రామీణ ఉపాధి కార్యక్రమాలపై రాష్ట్రం చేసిన ప్రతిపాదనలకు కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు సీఎం తెలిపారు.

సమావేశం అనంతరం తెలంగాణలో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రత్యక్షంగా పరిశీలించేందుకు రాష్ట్రానికి రావాలని శివరాజ్ సింగ్ చౌహాన్‌ను ముఖ్యమంత్రి ఆహ్వానించారు. ఈ సమావేశంలో తెలంగాణకు చెందిన పలువురు ఎంపీలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## టెస్ట్ ట్రాక్ లేదు...




సమాధానం చెప్పాల్సిన పరిస్థితి నెలకొంది.

తూతూ మంత్రంగా పరీక్షలు?

వాహనం సరిగా నడపలేని వారికి కూడా డ్రైవింగ్ లైసెన్స్‌లు జారీ అవుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో అభ్యర్థులు పూర్తి స్థాయిలో పరీక్షకు హాజరుకాకుండానే, కేవలం పత్రాల ప్రక్రియతోనే టెస్ట్ పూర్తి అయినట్లు నమోదు చేసి లైసెన్స్‌లు ఇస్తున్నారనే ప్రచారం సాగుతోంది. దీంతో "లంచం కొట్టు... లైసెన్స్ పట్టు" అన్న వ్యాఖ్యలు ప్రజల్లో వినిపిస్తున్నాయి.

దళారుల రాజ్యం?

ఆర్టీఏ కార్యాలయం చుట్టూ దళారుల వ్యవస్థ బలంగా పాతుకుపోయిందని వాహనదారులు ఆరోపిస్తున్నారు. నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకున్న వారి కంటే, దళారుల ద్వారా వచ్చిన ఫైళ్లకే ప్రాధాన్యం ఇస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. అక్రమాల వెనుక కొందరు అధికారుల పాత్రపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రోడ్లపై ప్రాణాలతో చెలగాటం

డ్రైవింగ్ నైపుణ్యం లేని వారికి లైసెన్స్‌లు జారీ కావడం రహదారి భద్రతకు తీవ్ర ముప్పుగా మారుతోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన లేని వ్యక్తులు వాహనాలు నడపడం వల్ల ప్రమాదాల ముప్పు పెరుగుతోందని ఆందోళన వ్యక్తమవుతోంది. రోడ్డు ప్రమాదాలను తగ్గించాలంటే లైసెన్స్ జారీ ప్రక్రియలో పారదర్శకత తప్పనిసరి అని అభిప్రాయపడుతున్నారు.

స్పందించేనా ఉన్నతాధికారులు?

ములుగు జిల్లా రవాణా శాఖలో డ్రైవింగ్ లైసెన్స్‌ల జారీపై వస్తున్న ఆరోపణలపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. కార్యాలయంలో అన్ని మౌలిక వసతులు, టెస్ట్ ట్రాక్ ఏర్పాటు చేసిన తర్వాతే డ్రైవింగ్ పరీక్షలు నిర్వహించాలని, అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## తెలంగాణ ముద్రతో

టెలివిజన్ అవార్డుల రూపకల్పన, మార్గదర్శకాలు, ప్రత్యేక లోగో, అవార్డుల పేర్లు, ఎంపిక విధానం తదితర అంశాలపై టెలివిజన్ అవార్డుల కమిటీతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్, ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ముకుంద రెడ్డి, కమిటీ చైర్మన్, సభ్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో టెలివిజన్ అవార్డులకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావడంపై విస్తృతంగా చర్చించారు. అవార్డులకు ప్రత్యేక లోగో రూపకల్పన, వివిధ విభాగాల్లో అవార్డుల ప్రదానం, అవార్డు గ్రహీతల ఎంపిక విధానం, ప్రదానోత్సవ వేదికల ఎంపిక వంటి అంశాలపై కమిటీ సభ్యులు పలు సూచనలు చేశారు. రాష్ట్రంలో తొలిసారిగా నిర్వహించనున్న ఈ అవార్డులను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోందని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ టెలివిజన్ రంగం ప్రజలకు అత్యధిక వినోదాన్ని అందించే శక్తివంతమైన మాధ్యమమని అన్నారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు టెలివిజన్ కార్యక్రమాలను ఎక్కువగా వీక్షిస్తున్న నేపథ్యంలో ఈ రంగంలో ప్రతిభ కనబరిచిన నటీనటులు, దర్శకులు, రచయితలు, సాంకేతిక నిపుణులు, సామాజిక సందేశాలతో కూడిన సీరియళ్లు, కార్యక్రమాలు, బాలల కార్యక్రమాలను రూపొందించే వారిని ప్రోత్సహించే విధంగా అవార్డులను రూపొందిస్తామని స్పష్టం చేశారు. టెలివిజన్ అవార్డులకు మాజీ ప్రధానమంత్రి పి.వి. నరసింహారావు పేరు పెట్టాలన్న కమిటీ సభ్యుల ప్రతిపాదనను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి చర్చిస్తానని మంత్రి వెల్లడించారు. బహుభాషా కోవిదుడిగా, దేశ ఆర్థిక సంస్కరణలకు పునాది వేసిన మహనీయుడిగా పి.వి. నరసింహారావు సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. అలాంటి మహనీయుల పేర్లను అవార్డులకు పరిశీలించడంలో ప్రభుత్వం సానుకూలంగా ఉందని తెలిపారు.

టెలివిజన్ అవార్డులకు సంబంధించిన మార్గదర్శకాలు, లోగో, పేర్లు తదితర అంశాలను వీలైనంత త్వరగా సిద్ధం చేసి సమర్పించాలని కమిటీకి మంత్రి ఆదేశించారు. అవార్డుల పేరు, లోగో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయం, ప్రత్యేకతను ప్రతిబింబించేలా ఉండాలని స్పష్టం చేశారు. అవార్డు గ్రహీతల ఎంపిక పూర్తిగా పారదర్శకంగా, నిష్పాక్షికంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కమిటీ చైర్మన్, సభ్యులకు సూచించారు. అవార్డుల నిర్వహణలో ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ కీలక పాత్ర పోషించాలని మంత్రి పేర్కొన్నారు. అవార్డుల ప్రదానోత్సవానికి రెండు లేదా మూడు వేదికలను పరిశీలించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎఫ్‌డీసీ అధికారులను ఆదేశించారు. సమావేశంలో వచ్చిన అన్ని ప్రతిపాదనలను ముఖ్యమంత్రితో చర్చించిన అనంతరం టెలివిజన్ అవార్డులపై తుది నిర్ణయం తీసుకుంటామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు.

## నెరేళ్ల బాధితులకు

పేర్కొన్నారు. ఆ ఘటన జరిగిన సమయంలో అధికారంలో ఉన్న కుటుంబంలో తాను కూడా సభ్యురాలినేనని, అందుకు బాధిత కుటుంబాలకు క్షమాపణ చెబుతున్నానని అన్నారు. నెరేళ్ల ఘటనలో పోలీసుల దాష్టీకానికి పాల్పడిన వారిపై ఇప్పటి వరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ఆమె ప్రశ్నించారు. అలాగే ఇసుక వ్యాపారంలో ధనదాహంతో ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఎందుకు వచ్చిందని నిలదీశారు. బాధ్యులైన పోలీసు అధికారులు, ఇతరులపై చట్టపరమైన చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై జాతీయ ఎస్సీ కమిషన్ విచారణ జరిగినప్పటికీ ఇప్పటి వరకు నివేదిక



వెలువడలేదని కవిత పేర్కొన్నారు. ఆ నివేదికను వెంటనే విడుదల చేయాలని కోరారు. అవసరమైతే బాధిత కుటుంబాలతో కలిసి ఢిల్లీకి వెళ్లి న్యాయం కోసం పోరాటం చేస్తామని ప్రకటించారు. నెరేళ్ల బాధిత కుటుంబాలకు ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆర్థిక సహాయం అందలేదని ఆమె ఆరోపించారు. మృతుడు గంధం గోపాల్ కుటుంబం తొమ్మిదేళ్ల పాటు ఆసుపత్రుల చుట్టూ తిరిగిందని, అయినప్పటికీ ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా అందలేదని విమర్శించారు. బాధిత కుటుంబాలందరికీ కోటి రూపాయల పరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు.

ఈ ఘటనపై రాజకీయాలకు అతీతంగా అన్ని రాజకీయ పార్టీలు మానవత్వంతో స్పందించి బాధిత కుటుంబాలకు అండగా నిలవాలని కవిత పిలుపునిచ్చారు. నెరేళ్ల ఘటనలో చట్టాన్ని అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటేనే భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉంటాయని అభిప్రాయపడ్డారు. తెలంగాణ రక్షణ సేన ప్రజల హక్కుల పరిరక్షణ కోసమే ఏర్పాటైన సంస్థ అని కవిత తెలిపారు. నెరేళ్ల బాధితులకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. సమస్యలపై ప్రశ్నిస్తూ, బాధితుల తరఫున పోరాడుతూ, పరిష్కారం సాధించే వరకు తమ మద్దతు కొనసాగుతుందని వెల్లడించారు

## 16 మంది మావోయిస్టుల

కలిపి రూ.39 లక్షల బహుమతి ప్రకటించబడినట్లు సీనియర్ పోలీసు అధికారులు వెల్లడించారు. వారిలో నిషేధిత మావోయిస్టు సంస్థ ప్రాంతీయ కమిటీ సభ్యుడు సంతోష్ మహతో అలియాస్ వాసుదేవ్ కూడా ఉన్నాడు. అతనిపై ఒక్కరిపైనే రూ.15 లక్షల రివార్డు ఉండగా, వివిధ పోలీసు స్టేషన్లలో మొత్తం 128 కేసులు నమోదై ఉన్నాయని అధికారులు తెలిపారు. ఈ లొంగుబాటును జార్ఖండ్ పోలీసులకు పెద్ద విజయంగా రాష్ట్ర డీజీపీ తదాష మిశ్రా అభివర్ణించారు. ముఖ్యంగా కీలక నాయకుడు సంతోష్ మహతో లొంగిపోవడం వల్ల మావోయిస్టు కార్యకలాపాలకు గట్టి దెబ్బ తగిలిందని ఆయన పేర్కొన్నారు. లొంగిపోయిన మావోయిస్టులందరికీ ప్రభుత్వ నిబంధనల ప్రకారం చట్టబద్ధమైన పునరావాసం కల్పిస్తామని డీజీపీ హామీ ఇచ్చారు. సమాజంలో తిరిగి సాధారణ జీవితాన్ని గడిపేలా అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. రాష్ట్రాన్ని నేరరహితంగా, శాంతియుతంగా మార్చేందుకు జార్ఖండ్ పోలీసులు కట్టుబడి పనిచేస్తున్నారని డీజీపీ స్పష్టం చేశారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో భద్రతా చర్యలను మరింత బలోపేతం చేస్తూ, లొంగుబాట్లను ప్రోత్సహించే కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు.

## కార్మిక ఐక్యతే బలం..

నిర్ణయించే కీలక ఘట్టమని పేర్కొంటూ, ప్రతి సభ్యుడు క్రమశిక్షణతో, ఐక్యతతో పనిచేసి ఎన్‌ఎంయూను విజయవంతం చేయాలని కోరారు. వరంగల్ రీజియన్ కార్యదర్శి యాకస్వామి మాట్లాడుతూ, కార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణే యూనియన్ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రతి డిపోలో కార్యకర్తలు కార్మికులను నేరుగా కలిసి యూనియన్ ఆశయాలు, కార్యాచరణను వివరించి ఎన్నికల్లో ఘన విజయం సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. సమావేశంలో తొమ్మిది డిపోల అధ్యక్షులు, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, గ్యారేజ్ కార్మికులు పాల్గొని కార్మికుల సమస్యలు, యూనియన్ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణ, ఎన్నికల వ్యూహాలపై విస్తృతంగా చర్చించారు. భారీ సంఖ్యలో కార్మికుల హాజరు, నాయకుల ఐక్యతా సందేశాలు సమావేశానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చివరగా రానున్న యూనియన్ ఎన్నికల్లో ఎన్‌ఎంయూ విజయమే లక్ష్యంగా సమష్టిగా పనిచేయాలని సభ్యులు సంకల్పం వ్యక్తం చేశారు.

## హైడ్రా పేరుతో అరాచకం..

వాటిని హైడ్రా తాకదని, పేదల ఇళ్లపైనే చర్యలు తీసుకుంటోందని విమర్శించారు. హైడ్రాపై హైకోర్టు చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర ప్రభుత్వానికి గట్టి హెచ్చరికగా భావించాలని అన్నారు. కోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసిన తర్వాత కూడా ప్రభుత్వం సిగ్గుపడటం లేదని విమర్శించారు.

భూదందాలు చేస్తున్నది ఎవరు?

రాష్ట్రంలో భూ ఆక్రమణలు, కబ్జాలకు పాల్పడుతున్నది అధికార పార్టీ నేతలేనని కేటీఆర్ ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వం అధికారంలో నుంచి దిగిపోయే సమయానికి నిషేధిత జాబితాలో ఉన్న భూములు సుమారు 16 లక్షల ఎకరాలే ఉండగా, ప్రస్తుతం అవి కోటి ఎకరాలకు చేరుకోవడం వెనుక కారణం ఏమిటని ప్రశ్నించారు. భూములను నిషేధిత జాబితాలో చేర్చే ప్రక్రియలో భారీ అవకతవకలు జరుగుతున్నాయంటూ ఆరోపించిన ఆయన, భూదందాలు, కబ్జాలు చేస్తున్నది ప్రభుత్వమేనని విమర్శించారు.

'బ్లాక్‌మెయిలింగ్ టూల్‌గా హైడ్రా'

హైడ్రాను ప్రభుత్వం బ్లాక్‌మెయిలింగ్, వసూళ్ల సాధనంగా ఉపయోగిస్తోందని కేటీఆర్ ఆరోపించారు. పేదల ఇళ్లను కూల్చివేయడం తప్ప ఒక్క కొత్త ఇల్లు కూడా నిర్మించలేదని, దీనివల్ల రియల్ ఎస్టేట్ రంగం తీవ్రంగా దెబ్బతిందని అన్నారు. పెద్ద బిల్డర్లు చెరువులు, జలాశయాల పరిధిలో నిర్మాణాలు చేపడుతున్నా ప్రభుత్వం చూసీచూడనట్లు వ్యవహరిస్తోందని, అదే సమయంలో సాధారణ ప్రజలపైనే చర్యలు తీసుకుంటోందని విమర్శించారు. హైడ్రా రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రాజకీయ ఆయుధంగా మారిందని కేటీఆర్ ఆరోపించారు. కోర్టు ధిక్కరణ కేసుల్లో ఇంత తీవ్ర విమర్శలు ఎదుర్కొన్న అధికారిని కొనసాగించడం దురదృష్టకరమన్నారు. బిల్డర్ల నుంచి అక్రమ వసూళ్లు జరుగుతున్నాయన్న ఆరోపణలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నేతలకు చెందిన నిర్మాణాలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించిన కేటీఆర్, ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని ఆరోపించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే హైకోర్టు సూచనలకు అనుగుణంగా హైడ్రాను పూర్తిగా రద్దు చేస్తామని స్పష్టం చేశారు.

# శాసనసభ కమిటీల తొలి సమావేశం

- స్పీకర్ ఛాంబర్‌లో మూడు కమిటీల ప్రారంభ సమావేశాలు
- కమిటీల పనితీరుపై స్పీకర్ కీలక సూచనలు
- నూతన నియమావళి రూపకల్పనపై మంత్రి శ్రీధర్ బాబు ప్రతిపాదన
- పారదర్శకంగా పనిచేయాలని కమిటీలకు పిలుపు



**హైదరాబాద్, జూలై 28 (మన విశ్వం ):** తెలంగాణ శాసనసభ భవనంలోని స్పీకర్ ఛాంబర్‌లో శాసనసభ ప్రభుత్వ హామీల అమలు కమిటీ, నియమాల కమిటీ, నైతిక విలువల కమిటీల తొలి సమావేశాలు మంగళవారం నిర్వహించారు. సమావేశాలకు శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు హాజరయ్యారు. ప్రభుత్వ హామీల అమలు కమిటీ చైర్మన్ పటోళ్ల సంజీవరెడ్డి, నైతిక విలువల కమిటీ చైర్మన్ రేవూరి ప్రకాశ్ రెడ్డి, నియమాల కమిటీ సభ్యులు, ఇతర కమిటీ సభ్యులు సమావేశాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలో శాసనసభ కమిటీల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. శాసనసభ సమావేశాల్లో ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలును పర్యవేక్షించే బాధ్యత ప్రభుత్వ హామీల అమలు కమిటీపై ఉంటుందని, ఆ బాధ్యతను సమర్థంగా నిర్వర్తించాలని సూచించారు. శాసనసభ నిర్వహణను మరింత సమర్థవంతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా తీర్చిదిద్దడంలో నియమాల కమిటీ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.

శాసనసభ గౌరవం కేవలం చట్టాల రూపకల్పనతోనే కాకుండా సభ్యుల ప్రవర్తన, నిబద్ధత, వ్యవహార శైలితో కూడా ముడిపడి ఉంటుందని స్పీకర్ పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాన్ని పరిరక్షించడం, ప్రజాస్వామ్య వ్యవస్థపై నమ్మకాన్ని బలోపేతం చేయడం కోసం నైతిక విలువల కమిటీ నిష్పక్షపాతంగా, రాగద్వేషాలకు అతీతంగా పనిచేయాలని సూచించారు. కమిటీ చైర్మన్లకు అభినందనలు తెలియజేశారు. శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, శాసనసభ సభ్యులకు మార్గదర్శకంగా ఉండేది నియమావళి పుస్తకమని, దానికి అనుగుణంగానే సభ నిర్వహణ జరుగుతుందని చెప్పారు. శాసనసభను మరింత సమర్థవంతంగా నడిపేందుకు కమిటీ చైర్మన్లు, సభ్యులు కలిసి నూతన నిబంధనలతో నియమావళిని రూపొందించాలని సూచించారు. ఇతర రాష్ట్రాల శాసనసభలను అధ్యయనం చేసి అక్కడ అమలవుతున్న ఉత్తమ విధానాలను పరిశీలించాలని కూడా సూచించారు.

సభలో క్రమశిక్షణ, హుందాతనాన్ని కాపాడడంలో నైతిక విలువల కమిటీ కీలక బాధ్యత వహించాలని మంత్రి అన్నారు. కమిటీ నిర్ణయాలు పారదర్శకంగా ఉండి తెలంగాణ శాసనసభ దేశానికి ఆదర్శంగా నిలిచేలా పనిచేయాలని ఆకాంక్షించారు. అనంతరం కమిటీల చైర్మన్లు మాట్లాడుతూ, శాసనసభ తమపై ఉంచిన విశ్వాసానికి అనుగుణంగా పనిచేస్తూ సభ గౌరవాన్ని మరింత పెంచేందుకు కృషి చేస్తామని తెలిపారు. సమావేశంలో శాసనమండలి కార్యదర్శి వి. నరసింహాచార్యులు, శాసనసభ కార్యదర్శి రేండ్ల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో నేత్ర వైద్యానికి బలోపేతం

- ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రితో భాగస్వామ్యంపై సమీక్ష
- జిల్లా ఆసుపత్రుల్లో ఆధునిక నేత్ర చికిత్సల విస్తరణకు చర్యలు
- నవజాత శిశువుల కంటి పరీక్షలను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించే యోచన
- ఆగస్టులో కార్యాచరణ ప్రణాళిక కోసం ప్రత్యేక సదస్సు



**హైదరాబాద్, జూలై 28 (మన విశ్వం):** రాష్ట్ర ప్రభుత్వ ఆసుపత్రుల్లో నేత్ర వైద్య సేవలను మరింత బలోపేతం చేసే దిశగా ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రజలకు అందుబాటులో, నాణ్యమైన, సమాన వైద్య సేవలు అందించేందుకు పరస్పర సహకార అవకాశాలపై సమావేశంలో చర్చించారు. రాష్ట్రంలో 35 ప్రభుత్వ వైద్య కళాశాలలు ఉండగా, వాటిలోని నేత్ర వైద్య విభాగాలు ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నాయని మంత్రి తెలిపారు. ఈ ఆసుపత్రుల్లో కంటి పరీక్షలు, దృష్టి కొలత సేవలు, శుక్లాల శస్త్రచికిత్సలు నిరంతరం నిర్వహిస్తూ ప్రతి ఏడాది వేలాది మంది రోగులకు చికిత్స అందిస్తున్నట్లు వివరించారు. రాష్ట్ర అత్యుత్తమ నేత్ర వైద్య కేంద్రంగా ఉన్న సరోజిని కంటి ఆసుపత్రిలో రెటీనా శస్త్రచికిత్సలు, లేజర్ చికిత్సలు, మెల్లకంటి శస్త్రచికిత్సలు, కార్నియా మార్పిడి, కంటి కణితుల చికిత్స, కనురెప్పల శస్త్రచికిత్సలు, గ్లాకోమా చికిత్సలు వంటి అత్యాధునిక సేవలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా నేత్ర వైద్య సేవలను మరింత విస్తరించేందుకు జిల్లా ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో ప్రత్యేక నేత్ర శస్త్రచికిత్స గదులు, అవసరమైన పరికరాల ఏర్పాటుకు లోటుపాట్ల అంచనా ప్రక్రియను ఇప్పటికే పూర్తి చేసినట్లు మంత్రి తెలిపారు. ఈ సౌకర్యాల అభివృద్ధిని దశలవారీగా, నిర్ణీత గడువులో పూర్తి చేస్తామని వెల్లడించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి సహకారంతో అమలు చేస్తున్న నవజాత శిశువుల కంటి పరీక్షల పైలట్ కార్యక్రమం విజయవంతమైందని మంత్రి చెప్పారు. ఈ కార్యక్రమాన్ని దశలవారీగా ఇతర జిల్లాలకు కూడా విస్తరించే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా ప్రాంతీయ కార్నియా సేకరణ కేంద్రాలు (ఐ బ్యాంకులు) ఏర్పాటు చేయడంలో భాగస్వామ్యంపై కూడా చర్చించినట్లు వెల్లడించారు. రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం కింద ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన నేత్ర పరీక్షలు అందించేందుకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు చేపట్టే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు మంత్రి తెలిపారు. నేత్ర వైద్య సేవల బలోపేతానికి మరిన్ని సహకార రంగాలను గుర్తించేందుకు ఆగస్టు నెలలో ప్రభుత్వ బోధనాసుపత్రులు, నిపుణులు, సంబంధిత వర్గాలతో ప్రత్యేక సదస్సు నిర్వహించి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా చోంగ్తు, శాఖ ఉన్నతాధికారులు, ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి ప్రతినిధులు పాల్గొన్నారు.

# పెద్ది సుదర్శన్ ఆరోగ్యంపై బులెటిన్

- యశోద ఆసుపత్రి తాజా వైద్య ప్రకటన
- మెదడుకు ఆక్సిజన్ అందక దెబ్బతిన్నట్లు వైద్యుల అంచనా
- మాటలకు, నొప్పికి స్పందన లేని పరిస్థితి
- 72 గంటల తర్వాతే కోలుకునే అవకాశాలపై స్పష్టత



**హైదరాబాద్, జూలై 28 (మన విశ్వం ):** ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిపై యశోద ఆసుపత్రి యాజమాన్యం మంగళవారం హెల్త్ బులెటిన్ విడుదల చేసింది. ప్రస్తుతం ఆయనకు అత్యవసర వైద్య చికిత్స కొనసాగుతోందని, వైద్య బృందం నిరంతరం పర్యవేక్షిస్తోందని వెల్లడించింది. బులెటిన్ ప్రకారం, శ్వాసక్రియ సాధారణంగానే ఉన్నప్పటికీ, మెదడుకు కొంతసేపు తగినంత ఆక్సిజన్ అందకపోవడం వల్ల మెదడు దెబ్బతిన్నట్లు వైద్యులు భావిస్తున్నట్లు పేర్కొన్నారు. దీనిపై నిరంతర వైద్య పరీక్షలు కొనసాగుతున్నాయని తెలిపారు.

ప్రస్తుతం ఆయన మాటలకు గానీ, నొప్పికి గానీ స్పందించడం లేదని వైద్యులు వెల్లడించారు. ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అవసరమైన చికిత్స అందిస్తున్నట్లు వివరించారు. అంతర్జాతీయ వైద్య మార్గదర్శకాల ప్రకారం 72 గంటల తర్వాత న్యూరోలాజికల్ రీ-అసెస్‌మెంట్ నిర్వహించిన అనంతరమే మెదడు పనితీరు, కోలుకునే అవకాశాలపై స్పష్టమైన అంచనా వేయడం సాధ్యమవుతుందని వైద్యులు తెలిపారు. ఆసుపత్రిలో నిపుణుల బృందం పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతోందని, తదుపరి ఆరోగ్య పరిస్థితిపై అవసరమైన సమయంలో మరో వైద్య బులెటిన్ విడుదల చేస్తామని యశోద ఆసుపత్రి యాజమాన్యం వెల్లడించింది.

# 500 స్పెషలిస్ట్ డాక్టర్ల ఫలితాలు విడుదల

- నాలుగు విభాగాల్లో నియామకాలకు తుది జాబితా ప్రకటింపు
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యుల కొరత తగ్గింపే లక్ష్యం
- ఇప్పటివరకు 1,192 పోస్టుల భర్తీ పూర్తి
- మిగిలిన పోస్టులను త్వరగా భర్తీ చేయాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశం



**హైదరాబాద్, జూలై 28 (మన విశ్వం ):** తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో స్పెషలిస్ట్ డాక్టర్ల నియామక ప్రక్రియలో మరో కీలక ముందడుగు పడింది. మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు మంగళవారం జనరల్ సర్జరీ, జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్స్, రేడియాలజీ విభాగాలకు చెందిన మొత్తం 500 స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టుల తుది ఫలితాలను విడుదల చేసింది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిపుణులైన వైద్యుల కొరతను అధిగమించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం మొత్తం 1,616 సివిల్ అసిస్టెంట్ సర్జన్ (స్పెషలిస్ట్) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో ఇప్పటికే అనస్థీషియా, ప్రసూతి-స్త్రీరోగాలు, శిశువైద్యం, ఆర్థోపెడిక్స్ తదితర విభాగాలకు చెందిన 692 పోస్టుల భర్తీ పూర్తయ్యింది. ఎంపికైన వైద్యులకు నియామక పత్రాలు అందజేసి పోస్టింగులు కూడా ఇచ్చారు.

తాజాగా విడుదలైన ఫలితాల్లో జనరల్ సర్జరీలో 174, జనరల్ మెడిసిన్‌లో 166, ఆర్థోపెడిక్స్‌లో 89, రేడియాలజీలో 71 పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల వివరాలను ప్రకటించారు. ప్రొవిజనల్ మెరిట్ జాబితా విడుదల అనంతరం అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించి తుది ఎంపిక జాబితాను ఖరారు చేసినట్లు అధికారులు తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల వివరాలను మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. ఎంపికైన వైద్యులు అవసరమైన ప్రక్రియలను పూర్తి చేసి త్వరలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో విధుల్లో చేరనున్నట్లు అధికారులు తెలిపారు.

స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టులకు ఎంపికైన వైద్యులను ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అభినందించారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో అంకితభావంతో పనిచేయాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 24 విభాగాల్లో భర్తీ చేస్తున్న 1,616 స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టుల్లో ఇప్పటివరకు 1,192 పోస్టుల భర్తీ పూర్తయిందని, మిగిలిన పోస్టుల నియామక ప్రక్రియను కూడా వీలైనంత త్వరగా పూర్తి చేయాలని రిక్రూట్‌మెంట్ బోర్డు అధికారులను ఆదేశించారు.

## తబ్లీఘీ జమాత్ సమావేశంలో బీఆర్ఎస్ నేతలు



- చాంద్రాయణగుట్టలో జరిగిన సమావేశానికి హాజరు
- మత పెద్దలు, నిర్వాహకులతో మర్యాదపూర్వక భేటీ
- శుభాకాంక్షలు తెలిపిన మాజీ మంత్రులు
- శాంతి, సౌభ్రాతృత్వం నెలకొనాలని ఆకాంక్ష

**హైదరాబాద్, జూలై 28 (మన విశ్వం ):** హైదరాబాద్‌లోని చాంద్రాయణగుట్టలో నిర్వహించిన తబ్లీఘీ జమాత్ సమావేశానికి మాజీ మంత్రి హరీశ్ రావుతో పాటు పలువురు బీఆర్ఎస్ నేతలు హాజరయ్యారు. సమావేశంలో మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సి. లక్ష్మారెడ్డి, వి. శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మాణిక్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలు సమావేశానికి హాజరైన మత పెద్దలు, నిర్వాహకులను మర్యాద పూర్వకంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. సమావేశం విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షిస్తూ వారి సేవలను అభినందించారు. సమావేశంలో పాల్గొన్న నాయకులు దేశంలో శాంతి, సామరస్యం, సౌభ్రాతృత్వం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. అన్ని వర్గాల ప్రజలు పరస్పర గౌరవంతో కలిసి జీవించాలనే సందేశాన్ని ఈ సందర్భంగా వ్యక్తం చేశారు. మత, సామాజిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని నేతలు అభిప్రాయపడ్డారు. భిన్న మతాలు, సంస్కృతుల మధ్య పరస్పర అవగాహన, సహకారం మరింత బలపడాలని కోరారు. సమావేశంలో పెద్ద సంఖ్యలో మత పెద్దలు, నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు. దేశంలో శాంతి, ప్రజల సంక్షేమం, సామాజిక సామరస్యం నెలకొనాలని ప్రార్థనలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.

## జగిత్యాలలో స్కూల్ బస్సుకు ప్రమాదం

- ఆర్టీసీ అద్దె బస్సు ఢీకొన్న ఘటన
- బ్రేకులు పనిచేయకపోవడమే ప్రమాదానికి కారణమని సమాచారం
- ఇద్దరు విద్యార్థులకు స్వల్ప గాయాలు
- 26 మంది విద్యార్థులు సురక్షితంగా బయటపడిన ఘటన



**జగిత్యాల, జూలై 28 (మన విశ్వం ):** జగిత్యాల జిల్లా కేంద్రంలోని యవార్ రోడ్డులో మంగళవారం ఆర్టీసీ అద్దె బస్సు, ఓ ప్రైవేట్ పాఠశాల బస్సును ఢీకొట్టడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఆర్టీసీ బస్సు బ్రేకులు సరిగా పనిచేయకపోవడమే ఈ ప్రమాదానికి కారణమై ఉండవచ్చని ప్రాథమిక సమాచారం వెల్లడిస్తోంది. ఘటనతో కొద్దిసేపు ఆ ప్రాంతంలో ఆందోళన నెలకొంది. ప్రమాదం జరిగిన సమయంలో పాఠశాల బస్సులో మొత్తం 26 మంది విద్యార్థులు ప్రయాణిస్తున్నారు. ఢీకొట్టిన ప్రభావంతో ఇద్దరు విద్యార్థులకు స్వల్ప గాయాలు కాగా, వెంటనే వారిని చికిత్స కోసం సమీప ఆసుపత్రికి తరలించారు. వైద్యులు వారికి చికిత్స అందించగా, ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం. మిగిలిన విద్యార్థులంతా సురక్షితంగా బయటపడటంతో తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యం ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న వెంటనే స్థానికులు, పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. విద్యార్థులను సురక్షితంగా అక్కడి నుంచి తరలించి అవసరమైన ఏర్పాట్లు చేశారు. ప్రమాదం కారణంగా యవార్ రోడ్డులో కొంతసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలపై అధికారులు విచారణ చేపట్టారు. విద్యార్థుల రవాణాకు వినియోగించే వాహనాల నిర్వహణ, సాంకేతిక పరిస్థితులపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు సేకరిస్తున్న అధికారులు, ప్రమాదానికి బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## డిజిటల్ పోలీసింగ్‌పై ఎస్పీ సమీక్ష



- ఐటీ కోర్, సైబర్ సెల్ విభాగాల తనిఖీ
- సైబర్ నేరాల నియంత్రణపై అధికారులకు ఆదేశాలు
- డిజిటల్ వ్యవస్థల వినియోగం మరింత
- సమర్థవంతం చేయాలని సూచన
- సాంకేతికతతో పోలీసింగ్‌ను బలోపేతం చేయడంపై దృష్టి

**కొత్తగూడెం, జూలై 28 (మన విశ్వం ):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసు కార్యాలయంలోని ఐటీ కోర్, సైబర్ సెల్ విభాగాలను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మంగళవారం సందర్శించి పనితీరును సమీక్షించారు. డిజిటల్ పోలీసింగ్ వ్యవస్థలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా సైబర్ నేరాల నియంత్రణకు చేపడుతున్న చర్యలు, సాంకేతిక ఆధారిత దర్యాప్తు విధానాలపై ఎస్పీ సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన పోలీసు సేవలు అందించడంలో సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్, క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ సిస్టమ్, ఈ-సాక్ష్య, నాట్‌గ్రిడ్ వంటి డిజిటల్ వ్యవస్థలను మరింత సమర్థవంతంగా వినియోగించాలని అధికారులకు సూచించారు. వీటి ద్వారా దర్యాప్తు నాణ్యత, కేసుల పరిష్కార వేగం పెరుగుతుందని తెలిపారు.

సైబర్ నేరాల నివారణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తిస్థాయిలో వినియోగించడంతో పాటు ప్రజల్లో అవగాహన కార్యక్రమాలను కూడా విస్తృతంగా నిర్వహించాలని ఎస్పీ ఆదేశించారు. ప్రతి కేసును సాంకేతిక ఆధారాలతో త్వరితగతిన ఛేదించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో డిజిటల్ పోలీసింగ్ వ్యవస్థలను మరింత బలోపేతం చేసి ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని ఎస్పీ రోహిత్ రాజు అధికారులకు స్పష్టం చేశారు. సమావేశంలో ఐటీ కోర్, సైబర్ సెల్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

బుధవారం, జూలై 29, 2026 | మన విశ్వం VOICE OF THE PEOPLE-POWER OF TRUTH తెలుగు వార్తా దినపత్రిక | 4

# భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి: ప్రధాన కార్యదర్శి



**- జిల్లా కలెక్టర్లతో అత్యవసర దూరవాణి సమావేశం**
**- రెండు రోజులపాటు భారీ వర్షాల హెచ్చరికపై సమీక్ష**
**- అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశం**
**- రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుకు పూర్తి సహకారం**

**హైదరాబాద్, జూలై 28 (మన విశ్వం ):** రాష్ట్రంలో రానున్న రెండు మూడు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న భారత వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. మంగళవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, పోలీసు కమిషనర్లు, జిల్లా పోలీసు అధికారి లతో దూరవాణి ద్వారా సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, వ్యవసాయ శాఖ రూపొందించిన ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళిక, రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న వనమహోత్సవ కార్యక్రమాల పురోగతిపై సమగ్రంగా చర్చించారు. సాధారణ వర్షపాతం నమోదైన జిల్లాలు ఐదు నుంచి ఆరు మాత్రమే ఉండగా, మిగిలిన 26 జిల్లాల్లో వర్షపాతం లోటు ఉందని ప్రధాన కార్యదర్శి తెలిపారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులకు అవసరమైన అన్ని విధాల సహకారం అందించాలని అధికారులను ఆదేశించారు.

వ్యవసాయ శాఖ రూపొందించిన ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికలో భాగంగా అన్ని జిల్లాల్లో విత్తనాల ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు ప్రధాన కార్యదర్శి తెలిపారు. ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలనుకునే రైతులకు అవసరమైన విత్తనాలు, సాంకేతిక సలహాలు, ఇతర సహాయ సహకారాలను అందించేందుకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందన్నారు. వ్యవసాయ అధికారులతో సమన్వయం చేసుకుని రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కలెక్టర్లకు సూచించారు. భారత వాతావరణ శాఖ తాజా హెచ్చరికల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ప్రధాన కార్యదర్శి ఆదేశించారు. వర్షాల ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టడంతో పాటు లోతట్టు ప్రాంతాలు, వాగులు, వంకలు, చెరువుల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. అవసరమైన యంత్రాలు, సహాయక బృందాలు సిద్ధంగా ఉంచి ఎలాంటి అత్యవసర పరిస్థితినైనా ఎదుర్కొనేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.

విపత్తు నిర్వహణ దృష్ట్యా జాతీయ విపత్తు స్పందన దళం బృందాలను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం, ములుగు, నిర్మల్ జిల్లాల్లో ముందుగానే మోహరించినట్లు ప్రధాన కార్యదర్శి వెల్లడించారు. హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రధాన కేంద్రాల్లో సిద్ధంగా ఉన్న అదనపు బృందాలను అవసరాన్ని బట్టి ప్రభావిత ప్రాంతాలకు వెంటనే తరలించే ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. జిల్లా అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తూ ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఈ దూరవాణి సమావేశంలో ప్రధాన కార్యదర్శితో పాటు అహ్మద్ నదీమ్, దాసరి హరిచందన, సురేంద్ర మోహన్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా పనిచేస్తూ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ప్రధాన కార్యదర్శి మరోసారి స్పష్టం చేశారు.

# ప్రశ్నపత్రాల లీకేజీలపై కఠిన చర్యలు తీసుకోవాలి

**- పరీక్షల పారదర్శకతపై సీఎం దృష్టి**
**- ప్రశ్నపత్రాల లీకేజీలపై కఠిన చర్యలకు పిలుపు**
**- కోచింగ్ కేంద్రాల నియంత్రణకు జాతీయ విధానం అవసరం**
**- ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యకు శాశ్వత పరిష్కారం**
**- హైడ్రా పనులు కొనసాగుతాయని స్పష్టీకరణ**



**న్యూఢిల్లీ, జూలై 28 (మన విశ్వం ):** ప్రశ్నపత్రాల లీకేజీలకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలిసిన అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన, పరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహించినప్పుడు పెద్దగా సమస్యలు తలెత్తలేదని, ఆఫ్‌లైన్ పరీక్షల సమయంలోనే ప్రశ్నపత్రాల లీకేజీ వంటి ఘటనలు ఎక్కువగా చోటుచేసు కుంటున్నాయని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా అనుమతులు లేకుండానే కోచింగ్ కేంద్రాలు విస్తరిస్తున్నాయని, కొన్ని చోట్ల అవే ప్రశ్నపత్రాల లీకేజీలకు కేంద్రాలుగా మారుతున్నాయని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ఈ పరిస్థితులను అరికట్టేందుకు దేశస్థాయిలో సమగ్ర విధానం రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. విశ్వవిద్యాలయాల వ్యవహారాల్లో కేంద్ర ప్రభుత్వం అధిక జోక్యం చేసుకోవద్దని, విద్యా వ్యవస్థ రాష్ట్రాల పరిధిలోనే ఉంటే పారదర్శకత మరింత మెరుగుపడుతుందని అభిప్రాయపడ్డారు. ఈ అంశంపై పార్లమెంట్‌లో విస్తృత చర్చ జరగాలని సూచించారు.తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను యూపీఎస్సీ విధానానికి అనుగుణంగా ప్రక్షాళన చేసి నియామకాలు చేపట్టడంతో పరీక్షల నిర్వహణలో పారదర్శకత సాధించామని సీఎం తెలిపారు. విద్యార్థుల్లో విశ్వాసాన్ని పెంపొందించేలా పరీక్షలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. గతంలో అక్రమాలకు పాల్పడిన కొన్ని సంస్థలపై చర్యలు తీసుకోకపోవడం వల్ల అవి జాతీయ స్థాయి పరీక్షల వరకు ప్రభావం చూపాయని విమర్శిస్తూ, ఇలాంటి సంస్థలపై కఠిన చర్యలు అవసరమన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అంశంపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ కొనసాగుతోందని ముఖ్యమంత్రి వెల్లడించారు. గత ప్రభుత్వ కాలానికి చెందిన బకాయిలు ఉన్నప్పటికీ వాటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఇకపై ప్రతి విద్యా సంవత్సరానికి సంబంధించిన ఫీజులను అదే సంవత్సరంలో పూర్తిగా చెల్లించే విధంగా ప్రణాళిక రూపొందించామని, అవసరమైన నిధులను ముందుగానే బ్యాంకు ఖాతాల్లో జమ చేసే విధానాన్ని అమలు చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో ప్రతి సంవత్సరం రూ.2,200 కోట్ల నుంచి రూ.2,400 కోట్ల వరకు ఈ పథకానికి అవసరమవుతాయని పేర్కొన్నారు.

హైడ్రా కార్యకలాపాలపై కూడా ప్రభుత్వం స్పష్టమైన వైఖరితో ఉందని ముఖ్యమంత్రి చెప్పారు. హైకోర్టు ఆదేశాలను ఇంకా పూర్తిగా పరిశీలించాల్సి ఉందని, ప్రభుత్వ స్థాయిలో సమీక్షించిన అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. న్యాయస్థానాల ఆదేశాలను గౌరవిస్తూనే హైడ్రా చేపడుతున్న కార్యక్రమాలను ప్రజాహితం దృష్ట్యా భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# బాలికను కాపాడిన ఆర్టీసీ సిబ్బంది

**- అప్రమత్తతతో విద్యార్థినిని గుర్తించిన కండక్టర్, డ్రైవర్**
**- గురుకుల విద్యార్థినిని సురక్షితంగా పోలీసులకు అప్పగింత**
**- మిధాని డిపో సిబ్బంది చొరవపై ప్రశంసలు**
**- బాధ్యతాయుత సేవలకు అభినందనలు తెలిపిన పొన్నం ప్రభాకర్**



**హైదరాబాద్, జూలై 28 (మన విశ్వం ):** సమయస్ఫూర్తితో వ్యవహరించిన తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మిధాని డిపో బస్సు సిబ్బంది ఓ బాలికను సురక్షితంగా పోలీసులకు అప్పగించి ప్రశంసలు అందుకున్నారు. పటాన్‌చెరువుకు చెందిన తెలంగాణ మైనారిటీ గురుకుల విద్యార్థిని అనూహ్య పరిస్థితుల్లో ఆర్టీసీ బస్సు ఎక్కగా, కండక్టర్, డ్రైవర్ అప్రమత్తతతో వ్యవహరించి ఆమెను క్షేమంగా భద్రతా సిబ్బందికి అప్పగించారు. సమాచారం ప్రకారం, బస్సు సంఖ్య 218లో ప్రయాణించిన బాలిక వద్ద కేవలం పది రూపాయల నోటు మాత్రమే ఉండగా, కాళ్లకు చెప్పులు కూడా లేవని సిబ్బంది గమనించారు. ఆమె పరిస్థితిపై అనుమానం వచ్చిన కండక్టర్ శేఖర్, డ్రైవర్ జె.ఎస్. కుమార్ బాలికతో మాట్లాడి వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేశారు. బస్సులోని మరో ప్రయాణికుడి ఫోన్ ద్వారా ఆమె మాట్లాడిన నంబర్ ఆధారంగా బాలిక తెలంగాణ మైనారిటీ గురుకుల విద్యార్థినిగా నిర్ధారించారు.అనంతరం ఎలాంటి ప్రమాదం జరగకుండా బాలికను సురక్షితంగా సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి పోలీసుల సంరక్షణలో అప్పగించారు. ఆర్టీసీ సిబ్బంది చూపిన అప్రమత్తత, బాధ్యతాయుత వైఖరి వల్ల బాలిక సురక్షితంగా కుటుంబ సభ్యులు, సంబంధిత అధికారుల వద్దకు చేరే అవకాశం కలిగింది. ఈ ఘటనపై మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందిస్తూ, సమాజంలో చాలామంది నిర్లక్ష్యంగా వ్యవహరించే పరిస్థితుల్లో మిధాని డిపో కండక్టర్ శేఖర్, డ్రైవర్ జె.ఎస్. కుమార్ చూపిన చొరవ అభినందనీయమని పేర్కొన్నారు. వారి మానవత్వం, సేవాభావం ఇతరులకు ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. ప్రజల భద్రత విషయంలో ఆర్టీసీ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించడం సంస్థపై ప్రజల విశ్వాసాన్ని మరింత పెంచుతుందని మంత్రి అభిప్రాయపడ్డారు. విధి నిర్వహణలో బాధ్యత, మానవత్వం కలగలిపి పనిచేసిన కండక్టర్ శేఖర్, డ్రైవర్ జె.ఎస్. కుమార్‌లను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

# నూతన కలెక్టరేట్ పనుల సమీక్ష




**- చివరి దశ సుందరీకరణ పనులను పరిశీలించిన కలెక్టర్**
**- నాణ్యతతో నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశం**
**- ప్రజలకు మెరుగైన సేవలే లక్ష్యమన్న కలెక్టర్**
**- ఆదర్శవంతమైన కలెక్టరేట్‌గా తీర్చిదిద్దాలని సూచన**

**ములుగు, జూలై 28 (మన విశ్వం ):** ములుగు జిల్లా నూతన సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలో కొనసాగుతున్న చివరి దశ సుందరీకరణ పనులను జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు మంగళవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. పనులను వేగవంతం చేసి నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భవన సముదాయంలో చేపడుతున్న ల్యాండ్‌స్కేపింగ్, అంతర్గత రహదారుల నిర్మాణం, పచ్చదనం అభివృద్ధి, విద్యుత్ దీపాల ఏర్పాటు, పార్కింగ్, తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్యం, ఉద్యానవనాల అభివృద్ధి తదితర పనుల పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. మిగిలిన పనులు ఆలస్యం కాకుండా ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రజలకు అన్ని ప్రభుత్వ శాఖల సేవలు ఒకేచోట మెరుగైన వాతావరణంలో అందించేలా నూతన కలెక్టరేట్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలకు సౌకర్యవంతమైన, ఆధునిక పరిపాలనా కేంద్రంగా ఈ భవనం నిలవాలని అన్నారు.భవన సముదాయం పరిశుభ్రంగా, ఆకర్షణీయంగా కనిపించేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. పనుల అమలులో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పర్యవేక్షించాలని సూచించారు. పరిశీలన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సిహెచ్ మహేందర్, రహదారులు--భవనాల శాఖ అధికారులు, మున్సిపల్ కమిషనర్ సంపత్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. నూతన కలెక్టరేట్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందు బాటులోకి తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు.

# స్కైరూట్ ప్రతినిధులతో సీఎం భేటీ

**- అత్యాధునిక పరిశ్రమలకు తెలంగాణ ప్రోత్సాహం**
**- విక్రమ్-1 విజయంపై ముఖ్యమంత్రికి వివరాలు**
**- అంతరిక్ష రంగంలో సహకార అవకాశాలపై చర్చ**
**- స్టార్టప్‌లకు ప్రభుత్వం పూర్తి మద్దతు**



**ఢిల్లీ, జూలై 28 (మన విశ్వం):** అత్యాధునిక సాంకేతిక పరిశ్రమలు, స్టార్టప్‌ల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఢిల్లీలో స్కైరూట్ ఏరోస్పేస్ సహ వ్యవస్థాపకుడు, ముఖ్య కార్యనిర్వహణ అధికారి పవన్ కుమార్ చందన, సహ వ్యవస్థాపకుడు, ముఖ్య నిర్వహణ అధికారి భరత్ డాకా ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి సంస్థ కార్యకలాపాలు, అంతరిక్ష రంగంలో సాధించిన విజయాలను వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఏరోస్పేస్ రంగ అభివృద్ధిపై ఇరువర్గాలు విస్తృతంగా చర్చించాయి. సమావేశంలో స్కైరూట్ ఏరోస్పేస్ ప్రతినిధులు భారతదేశంలో ప్రైవేటు రంగం అభివృద్ధి చేసిన తొలి ఆర్బిటల్-తరగతి ప్రయోగ వాహనం “విక్రమ్-1”ను విజయవంతంగా ప్రయోగించిన విషయాన్ని ముఖ్యమంత్రికి వివరించారు. ఈ విజయంతో అమెరికా, చైనా తర్వాత ప్రైవేటు రంగం ద్వారా ఆర్బిటల్ ప్రయోగ సామర్థ్యాన్ని సాధించిన ప్రపంచంలోని మూడో దేశంగా భారత్ నిలిచిందని తెలిపారు. దేశ అంతరిక్ష రంగానికి ఇది చారిత్రాత్మక విజయమని పేర్కొన్నారు.

తెలంగాణలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఏరోస్పేస్, అంతరిక్ష సాంకేతిక రంగాలపై సమావేశంలో ప్రత్యేకంగా చర్చ జరిగింది. ఆధునిక తయారీ, పరిశోధన-అభివృద్ధి, కొత్త ఆవిష్కరణలు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న అనుకూల వాతావరణాన్ని స్కైరూట్ ప్రతినిధులు ప్రస్తావించారు. ప్రభుత్వం, ప్రైవేటు అంతరిక్ష పరిశ్రమల మధ్య మరింత సమన్వయం పెంచితే ఈ రంగం వేగంగా అభివృద్ధి చెందుతుందని అభిప్రాయపడ్డారు. తెలంగాణలో అంతరిక్ష, ఏరోస్పేస్ రంగాల్లో పెట్టుబడులు, పరిశోధన కేంద్రాల ఏర్పాటు, తయారీ యూనిట్ల స్థాపనకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రపంచ స్థాయి సంస్థలు తెలంగాణలో కార్యకలాపాలు ప్రారంభించేలా పారిశ్రామిక విధానాలను మరింత బలోపేతం చేస్తున్నామని పేర్కొన్నారు. యువతకు అధునాతన సాంకేతిక రంగాల్లో ఉపాధి అవకాశాలు పెంచే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని వెల్లడించారు.

ఈ సందర్భంగా స్కైరూట్ ఏరోస్పేస్ వ్యవస్థాపకులను ముఖ్యమంత్రి అభినందించారు. వారు సాధించిన విజయం భారత అంతరిక్ష రంగ ప్రతిష్ఠను ప్రపంచవ్యాప్తంగా మరింత పెంచిందని కొనియాడారు. ఇలాంటి సంస్థలు దేశ సాంకేతిక సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటుతున్నాయని, యువ పారిశ్రామికవేత్తలకు స్ఫూర్తిగా నిలుస్తున్నాయని అన్నారు. అంతరిక్ష సాంకేతికత, పరిశోధన, ఆవిష్కరణల రంగాల్లో తెలంగాణను దేశంలో అగ్రస్థానంలో నిలబెట్టేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. స్టార్టప్‌లు, అత్యాధునిక సాంకేతిక సంస్థలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, విధానపరమైన మద్దతు, పెట్టుబడులకు అనుకూల వాతావరణాన్ని కల్పిస్తూ రాష్ట్రాన్ని అంతరిక్ష, ఏరోస్పేస్ రంగాలకు ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు కొనసాగిస్తోందని పేర్కొన్నారు.

# జీహెచ్ఎంసీలో బోనాల వేడుకలు

**- ముఖ్య అతిథిగా పాల్గొన్న జనసేన రాష్ట్ర ఇంచార్జ్**
**- కట్ట మైసమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు**
**- పవన్ కళ్యాణ్ ఆరోగ్యం కోసం ప్రత్యేక ప్రార్థనలు**
**- ప్రజల సంక్షేమం, రైతుల సుభిక్షం కోరిన నేమూరి శంకర్ గౌడ్**



**హైదరాబాద్, జూలై 28 (మన విశ్వం ):** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన శ్రీశ్రీశ్రీ కట్ట మైసమ్మ అమ్మవారి బోనాల ఉత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ నేమూరి శంకర్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్వచ్ఛ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు యాటెల్లి దంగురాజు, శ్రీధర్, యూనియన్ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవాల్లో నేమూరి శంకర్ గౌడ్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అమ్మవారికి మొక్కులు చెల్లించి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా నేమూరి శంకర్ గౌడ్ మాట్లాడుతూ, అమ్మవారి చల్లని దీవెనలతో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. అలాగే మున్సిపల్ కార్మికులు, వారి కుటుంబ సభ్యులు, తెలుగు రాష్ట్రాల ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని కోరుకున్నారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు పంటలతో సుభిక్షంగా ఉండాలని, ప్రతి కుటుంబంలో సుఖశాంతులు నెలకొనాలని అమ్మవారిని ప్రార్థించినట్లు ఆయన చెప్పారు. బోనాల వంటి సాంప్రదాయ పండుగలు మన సంస్కృతి, ఆధ్యాత్మిక విలువలకు ప్రతీకలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ కార్మిక నాయకుడు దారపు దుర్గాప్రసాద్, పార్టీ సీనియర్ నాయకుడు నందగిరి సతీష్, నాయకులు ప్రవీణ్ సాహు, రాజు, శ్రీనివాస్, లలితతో పాటు యూనియన్ ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

# భూ వివాదాల పరిష్కారానికి రీ-సర్వే : మంత్రి

**- నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశం**
**- ప్రతి గ్రామంలో గ్రామసభలతో ప్రజలకు అవగాహన**
**- కలెక్టర్లు స్వయంగా పర్యవేక్షించాలని సూచన**
**- అత్యాధునిక సాంకేతికతతో భూముల హద్దుల నిర్ధారణ: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



**హైదరాబాద్, జూలై 28 (మన విశ్వం ):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూముల రీ-సర్వే కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యంతో అమలు చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార--పౌర సంబం ధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు ప్రతి భూమికి స్పష్టమైన హద్దులు, ప్రతి సర్వే నంబర్‌కు ప్రత్యేక భూదార్ గుర్తింపు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. సచివాలయంలో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో రీ-సర్వే జరుగుతున్న గ్రామాల పురోగతి, ప్రజల స్పందన, ఎదురవుతున్న సమస్యలు, పరిష్కార చర్యలపై రెవెన్యూ, సర్వే శాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా తొలి దశలో జిల్లాకు 70 గ్రామాల చొప్పున ఎంపిక చేసిన 2,240 గ్రామాల్లో రీ-సర్వే కొనసాగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించేందుకు ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహించాలని అధికారులకు సూచించారు.

రీ-సర్వే వల్ల కలిగే ప్రయోజనాలను రైతులు, భూ యజమానులకు వివరించి వారి సహకారంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి అన్నారు. సర్వే జరుగుతున్న ప్రతి గ్రామంలో అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి ప్రజల సందేహాలను వెంటనే నివృత్తి చేయాలని ఆదేశించారు. భూముల హద్దుల నిర్ధారణలో సంపూర్ణ పారదర్శకత పాటిస్తూ ప్రతి దశలో ప్రజలను భాగస్వాములను చేయాలని సూచించారు. రీ-సర్వే పనులను జిల్లా కలెక్టర్లు స్వయంగా పర్యవేక్షించి ప్రతి వారం పురోగతిని సమీక్షించాలని మంత్రి ఆదేశించారు. రెవెన్యూ, సర్వే శాఖలు సమన్వయంతో పనిచేసి నిర్ణీత లక్ష్యాలను సాధించాలని, ఎక్కడైనా సమస్యలు ఎదురైతే వెంటనే ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించాలని సూచించారు. భూమి రైతుకు కేవలం ఆస్తి మాత్రమే కాదని, కుటుంబ జీవనాధారమని పేర్కొంటూ దశాబ్దాలుగా కొనసాగుతున్న భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం కోసం ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.డీజీపీఎస్, రోవర్స్, జీఐఎస్ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో శాస్త్రీయ పద్ధతిలో సర్వే నిర్వహించడం ద్వారా ప్రతి కమతానికి ఖచ్చితమైన హద్దులు నిర్ణయించబడతాయని మంత్రి వివరించారు. రీ-సర్వే పూర్తయిన అనంతరం ప్రతి సర్వే నంబర్‌కు ప్రత్యేక భూదార్ నంబర్ కేటాయించి భూ భారతి పోర్టల్‌లో నమోదు చేయడం ద్వారా భూముల యాజమాన్యంపై శాశ్వత స్పష్టత ఏర్పడుతుందని చెప్పారు. దీంతో భూ రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు మరింత పారదర్శకంగా, వేగవంతంగా జరుగుతాయని పేర్కొన్నారు. నక్షాలు లేని 373 గ్రామాల్లో కూడా రీ-సర్వే వేగంగా కొనసాగుతోందని మంత్రి తెలిపారు. ఆయా గ్రామాల్లో సర్వే ప్రారంభానికి ముందే పట్టాదారులకు తప్పనిసరిగా నోటీసులు ఇవ్వాలని, ప్రభుత్వ భూములకు మార్కింగ్ పూర్తి చేసి, గ్రామకంఠం హద్దులను నిర్ధారించిన తరువాతే సర్వే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వారి సంతృప్తిని దృష్టిలో ఉంచుకుని ప్రతి నిర్ణయం ప్రజా కోణంలోనే తీసుకోవాలని సూచిస్తూ భూ వివాదాల్లేని తెలంగాణ నిర్మాణానికి అధికారులు అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

# బిల్లుల క్లెయిమ్ ప్రక్రియపై పోలీసులకు ప్రత్యేక శిక్షణ: డీజీపీ సి.వి. ఆనంద్

**- జిల్లాల పర్యటనల్లో వెలుగుచూసిన నిధుల వినియోగ సమస్యలు**
**- బిల్లుల క్లెయిమ్ విధానంపై అవగాహన లోపమే ప్రధాన కారణం**
**- డీజీపీ కార్యాలయంలో 'శిక్షకులకు శిక్షణ' కార్యక్రమం ప్రారంభం**
**- శిక్షణతో నిధుల వినియోగంలో మెరుగుదలపై ఆశాభావం**



**హైదరాబాద్, జూలై 28 (మన విశ్వం ):** వివిధ బడ్జెట్ కింద నిధులు మంజూరు కావడం లేదన్న జిల్లాల పోలీసు అధికారుల ఫిర్యాదుల నేపథ్యంలో బిల్లుల క్లెయిమ్ ప్రక్రియపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ తెలిపారు. జిల్లాల పర్యటనల సందర్భంగా పలువురు అధికారులు తమ శాఖలకు వివిధ బడ్జెట్ హెడ్స్ కింద నిధులు సకాలంలో అందడం లేదని తన దృష్టికి తీసుకువచ్చారని పేర్కొన్నారు. ఈ సమస్యపై సమగ్రంగా పరిశీలించిన అనంతరం అసలు కారణాన్ని గుర్తించి తక్షణ చర్యలు చేపట్టామని వెల్లడించారు. ప్రధాన కార్యాలయానికి తిరిగి వచ్చిన తర్వాత నిర్వహించిన సమీక్షలో నిధుల కొరత కంటే బిల్లులను క్లెయిమ్ చేసే విధానం, వాటి అకౌంటింగ్ ప్రక్రియపై సరైన అవగాహన లేకపోవడమే ప్రధాన సమస్యగా తేలిందని డీజీపీ తెలిపారు. బిల్లులను ఏ విధంగా సమర్పించాలి, ఏ పత్రాలను జతచేయాలి, ఏ గడువులోపు క్లెయిమ్ చేయాలి వంటి అంశాలపై అనేక జిల్లాల్లో స్పష్టత లేకపోవడంతో నిధుల విడుదలలో జాప్యం చోటుచేసుకుంటోందని వివరించారు.

ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని డీజీపీ కార్యాలయంలో 'శిక్షకులకు శిక్షణ' కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు సి.వి. ఆనంద్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే అధికారులు జిల్లాలకు వెళ్లి ఇతర సిబ్బందికి కూడా ఇదే అంశాలపై శిక్షణ అందించనున్నారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఒకే విధమైన విధానాన్ని అమలు చేసే అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. శిక్షణలో బిల్లులను సమర్పించే విధానం, నిర్ణీత గడువులు, ఆర్థిక లావాదేవీల నమోదు, బిల్లుల పరిశీలన, ధృవీకరణ తదితర అంశాలను సవివరంగా వివరిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ప్రతి బిల్లును సిద్ధం చేయడం, సమయానికి క్లెయిమ్ చేయడం ద్వారా నిధుల విడుదలలో జాప్యాన్ని నివారించవచ్చని అధికారులకు అవగాహన కల్పిస్తున్నారు. ఆర్థిక నిర్వహణలో పారదర్శకత, బాధ్యతాయుత వ్యవహారం పెంపొందించడంపైనా ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారు.పోలీసు శాఖలో ఆర్థిక వ్యవహారాలు సక్రమంగా నిర్వహించబడితే పరిపాలనా పనితీరు మరింత మెరుగుపడుతుందని డీజీపీ అభిప్రాయపడ్డారు. జిల్లాల స్థాయిలో ఎదురవుతున్న చిన్న చిన్న పరిపాలనా సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించడం ద్వారా శాఖ పనితీరును మరింత సమర్థవంతంగా మార్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం శిక్షణతో పాటు నిరంతర పర్యవేక్షణ కూడా కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమం పూర్తయిన తర్వాత జిల్లాల నుంచి బిల్లుల సమర్పణ, క్లెయిమ్ ప్రక్రియలో గణనీయమైన మెరుగుదల కనిపిస్తుందని డీజీపీ సి.వి. ఆనంద్ ఆశాభావం వ్యక్తం చేశారు. పోలీసు శాఖలో నిధుల వినియోగం, ఆర్థిక నిర్వహణ మరింత సమర్థవంతంగా సాగేందుకు ఇటువంటి సామర్థ్యాభివృద్ధి కార్యక్రమాలు కీలకంగా ఉపయోగపడతాయని తెలిపారు. అధికారులు నేర్చుకున్న విధానాలను క్షేత్రస్థాయిలో సమర్థంగా అమలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# గాయపడిన పోలీసు సిబ్బందిని పరామర్శించిన సీపీ

**- విధి నిర్వహణలో గాయపడిన ఇద్దరు పోలీసులకు భరోసా ధైర్యసాహసాలను అభినందించిన సీపీ**
**- డ్రగ్స్ తనిఖీల్లో జరిగిన ప్రమాదంపై విచారణ**
**- పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలింపు**



**హైదరాబాద్, జూలై 28 (మన విశ్వం ):** విధి నిర్వహణలో భాగంగా డ్రగ్స్ తనిఖీల సమయంలో గాయపడిన హెచ్-న్యూ విభాగానికి చెందిన కానిస్టేబుళ్లు ఎన్. మహేందర్ యాదవ్, ఎం. వంశీధర్‌లను హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ మంగళవారం పరామర్శించారు. లంగర్‌హౌజ్, ప్రశాంత్‌నగర్‌లోని వారి నివాసాలకు స్వయంగా వెళ్లిన సీపీ, ఇద్దరి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని కుటుంబ సభ్యులతో మాట్లాడారు. విధి నిర్వహణలో ధైర్యంగా వ్యవహరించిన వారికి శాఖ తరఫున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గాయపడిన కానిస్టేబుళ్ల మనోధైర్యాన్ని పెంపొందించేలా సీపీ మాట్లాడారు. విధి నిర్వహణలో ప్రాణాలకు తెగించి పనిచేసే పోలీసు సిబ్బంది సంక్షేమానికి శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. విధి నిర్వహణలో ఎదురయ్యే ఇలాంటి ఘటనలతో ఎవరూ అధైర్యపడవద్దని సూచించారు. వారి సేవలను ప్రశంసిస్తూ త్వరగా పూర్తిస్థాయిలో కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో టాస్క్ ఫోర్స్ డిప్యూటీ పోలీస్ కమిషనర్ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్ కూడా పాల్గొన్నారు.ఈ నెల 26న ఆబిడ్స్‌లోని తిలక్ రోడ్డులో డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం అందడంతో హెచ్-న్యూ బృందం తనిఖీలు నిర్వహించింది. ఈ సమయంలో అక్కడ ఉన్న నీలిరంగు బలేనో కారును పోలీసులు తనిఖీ చేయడానికి ప్రయత్నించగా, డ్రైవర్ తప్పించుకునేందుకు అత్యంత వేగంగా వాహనాన్ని రివర్స్‌లో నడిపిస్తూ పోలీసులపైకి దూసుకొచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనలో విధి నిర్వహణలో ఉన్న ఇద్దరు కానిస్టేబుళ్లు గాయపడ్డారు. కారు చక్రం కానిస్టేబుల్ మహేందర్ యాదవ్ కాలిపై నుంచి వెళ్లడంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. అదే ఘటనలో కానిస్టేబుల్ వంశీధర్ కూడా గాయపడ్డారు. వెంటనే ఇద్దరినీ సోమాజిగూడలోని యశోద ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. వైద్య చికిత్స అనంతరం ఇటీవల ఇద్దరూ కోలుకుని ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయి తమ ఇళ్లకు చేరుకున్నారు.

ఈ ఘటనను హైదరాబాద్ నగర పోలీసులు అత్యంత తీవ్రంగా పరిగణించారు. విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై ప్రాణాంతక దాడికి పాల్పడిన వ్యక్తిపై ఆబిడ్స్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటనకు సంబంధించిన అన్ని ఆధారాలను సేకరిస్తూ నిందితుడి కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. విధి నిర్వహణలో పోలీసు సిబ్బందిపై దాడులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని పోలీసు అధికారులు స్పష్టం చేశారు. చట్టాన్ని అమలు చేసే సిబ్బంది భద్రతకు ప్రభుత్వం, పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నాయని పేర్కొన్నారు. గాయపడిన ఇద్దరు కానిస్టేబుళ్లు త్వరగా కోలుకుని తిరిగి విధుల్లో చేరాలని ఆకాంక్షిస్తూ, వారి సంక్షేమానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

# జైపాల్ రెడ్డికి సీఎం రేవంత్ నివాళి

**- వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పుష్పాంజలి**
**- ఢిల్లీలోని అధికారిక నివాసంలో నివాళులర్పించిన ముఖ్యమంత్రి**
**- ఉత్తమ పార్లమెంటేరియన్ సేవలను స్మరించిన సీఎం**



**న్యూఢిల్లీ, జూలై 28 (మన విశ్వం ):** కేంద్ర మాజీ మంత్రి, ఉత్తమ పార్లమెంటేరియన్ స్వర్గీయ ఎస్. జైపాల్ రెడ్డి వర్ధంతి సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఘనంగా నివాళులర్పించారు. ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో ఏర్పాటు చేసిన జైపాల్ రెడ్డి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఆయన సేవలను స్మరించుకున్నారు. దేశ రాజకీయాల్లో, పార్లమెంటరీ వ్యవస్థలో జైపాల్ రెడ్డి అందించిన సేవలు చిరస్మరణీయమని ఈ సందర్భంగా గుర్తు చేశారు. సుదీర్ఘ రాజకీయ జీవితంలో ప్రజాసేవకు అంకితభావంతో పనిచేసిన జైపాల్ రెడ్డి దేశ రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు పొందారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ పార్లమెంట్‌లో తన వాగ్ధాటి, లోతైన అవగాహనతో అనేక అంశాలపై సమర్థవంతంగా తన అభిప్రాయాలను వినిపించిన నాయకుడిగా ఆయన చిరస్థాయిగా నిలిచారని తెలిపారు.కేంద్ర మంత్రిగా పలు కీలక శాఖలను సమర్థవంతంగా నిర్వహించిన జైపాల్ రెడ్డి దేశాభివృద్ధికి విశేష కృషి చేశారని ముఖ్యమంత్రి కొనియాడారు. ప్రజా సమస్యలపై ఆయనకు ఉన్న అవగాహన, నిబద్ధత, పారదర్శకత నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా ఆయనకు లభించిన గౌరవం ఆయన వ్యక్తిత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు. జైపాల్ రెడ్డి వర్ధంతి సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి. మహేష్ కుమార్ గౌడ్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు. చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన రాజకీయ, ప్రజాసేవా జీవితంలోని విశేషాలను స్మరించుకున్నారు.

దేశ రాజకీయాల్లో మేధావి నాయకుడిగా గుర్తింపు పొందిన జైపాల్ రెడ్డి పార్లమెంటరీ సంప్రదాయాలను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించారని నాయకులు అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్య వ్యవస్థపై ఆయనకు ఉన్న నిబద్ధత, విలువలతో కూడిన రాజకీయాలు నేటి ప్రజాప్రతినిధులకు మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. జైపాల్ రెడ్డి వంటి మహనీయుల ఆశయాలను కొనసాగించడం ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యత అని ఈ సందర్భంగా పలువురు నాయకులు పేర్కొన్నారు. ప్రజాసేవే పరమావధిగా భావించి ఆయన నడిచిన మార్గం భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని నివాళులర్పించిన నాయకులు అన్నారు. ఆయన సేవలను తెలంగాణ ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని పేర్కొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం: పొన్నం

**- ప్రజావాణి కార్యక్రమాన్ని పరిశీలించిన మంత్రి**
**- వినతులపై అధికారులతో నేరుగా మాట్లాడి ఆదేశాలు**
**- భూ సమస్యలు, ఇళ్లు, సంక్షేమ ఫిర్యాదులపై సమీక్ష**
**- నిర్ణీత గడువులో సమస్యల పరిష్కారానికి సూచనలు**



**హైదరాబాద్, జూలై 28 (మన విశ్వం ):** ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించి వారికి సమర్థవంతమైన పాలన అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని హైదరాబాద్ జిల్లా ఇంచార్జి, బీసీ సంక్షేమం మరియు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. మంగళవారం ప్రజాభవన్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాన్ని మంత్రి పరిశీలించి ప్రజల నుంచి నేరుగా వినతిపత్రాలు స్వీకరించారు. ప్రతి సమస్యను బాధ్యతాయుతంగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించిన మంత్రి, సంబంధిత శాఖల అధికారులతో నేరుగా ఫోన్‌లో మాట్లాడి సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేకుండా ప్రతి వినతిపై వేగంగా స్పందించాలని సూచించారు. ప్రజలకు ప్రభుత్వంపై మరింత విశ్వాసం పెరిగేలా అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని తెలిపారు.

ఈ సందర్భంగా భూ వివాదాలు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, రెండు పడకగదుల గృహాలు, రెవెన్యూ, మున్సిపల్, సంక్షేమ శాఖలకు సంబంధించిన ఫిర్యాదులపై మంత్రి సమగ్ర సమీక్ష నిర్వహించారు. అర్హులైన ప్రతి దరఖాస్తుదారుడికి న్యాయం జరిగేలా చట్టబద్ధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ప్రవాసి ప్రజావాణి ద్వారా విదేశాల్లో ఉపాధి, ఉద్యోగాలు, ఇతర కారణాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న తెలంగాణ ప్రజల వినతులను కూడా మంత్రి పరిశీలించారు. సంబంధిత శాఖల మధ్య సమన్వయం పెంచి ప్రవాసుల సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. విదేశాల్లో ఉన్న తెలంగాణ ప్రజలకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు.

ప్రజావాణిలో ప్రతిరోజూ అందుతున్న వినతులు, వాటి పరిష్కార స్థితి, శాఖల వారీగా తీసుకుంటున్న చర్యలపై మంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రతి వినతిని నిర్ణీత గడువులో పరిష్కరించాలని, పెండింగ్ ఫిర్యాదులను ప్రత్యేక దృష్టితో పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సేవలు అందించడంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక మండలి ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ప్రజావాణి నోడల్ అధికారి విద్యాసాగర్‌లతో మంత్రి సమావేశమై ప్రజావాణి నిర్వహణ విధానం, సమస్యల పరిష్కార ప్రక్రియపై వివరాలు తెలుసుకున్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటోందని, ప్రజావాణి ద్వారా అందిన ప్రతి వినతికి పారదర్శకంగా, వేగవంతంగా పరిష్కారం అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

# కాజీపేట డివిజన్ కోసం పోరాటం




**- జంతర్‌మంతర్ ధర్నాకు బయలుదేరిన బీఆర్ఎస్ శ్రేణులు**
**- కాజీపేట రైల్వే స్టేషన్‌లో సంఘీభావం తెలిపిన దాస్యం వినయ్ భాస్కర్**
**- రైల్వే డివిజన్ సాధించే వరకు ఉద్యమం కొనసాగుతుందన్న మాజీ ఎమ్మెల్యే**
**- కోచ్ ఫ్యాక్టరీ ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలని డిమాండ్**

**వరంగల్, జూలై 28 (మన విశ్వం):** కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటు సహా పలు రైల్వే హక్కుల సాధన కోసం ఈ నెల 30న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద భారత రాష్ట్ర సమితి చేపట్టనున్న ధర్నాలో పాల్గొనేందుకు బయలుదేరిన పార్టీ శ్రేణులకు మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ మంగళవారం కాజీపేట రైల్వే స్టేషన్‌లో సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ, పోరాటమే తమ పార్టీ పంథా అని, తెలంగాణ హక్కుల సాధన కోసం నిరంతరం ఉద్యమిస్తామని అన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం ఎలా పోరాడామో, అదే స్ఫూర్తితో రాష్ట్ర హక్కుల పరిరక్షణ కోసం కూడా ఉద్యమాలు కొనసాగిస్తామని పేర్కొన్నారు. భారత రాష్ట్ర సమితి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగానే పనిచేస్తోందని ఆయన తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజల నాలుగు దశాబ్దాల కోచ్ ఫ్యాక్టరీ కలను నిజం చేసేందుకు పార్టీ పోరాటం చేసిందని గుర్తు చేశారు. కోచ్ ఫ్యాక్టరీలో స్థానిక యువతకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటు, భూములు కోల్పోయిన బాధితులకు ఉద్యోగాలు, లోకో పైలట్ల సమస్యల పరిష్కారం, రైల్వేకు సంబంధించిన పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ జంతర్‌మంతర్ వద్ద శాంతియుత ధర్నా నిర్వహించనున్నట్లు దాస్యం వినయ్ భాస్కర్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు సంకు నర్సింగరావు, బొంగు అశోక్ యాదవ్, జోరిక రమేష్, పలువురు బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. ఢిల్లీలో జరిగే ధర్నాను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

# రూ.3.5 కోట్ల ప్రభుత్వ భూమి స్వాధీనం

**- చిల్పూర్‌లో ఆక్రమణ తొలగించిన రెవెన్యూ అధికారులు**
**- 2019 నుంచి అక్రమంగా ప్లాంటు నిర్వహణ**
**- కలెక్టర్ ఆదేశాలతో ప్రభుత్వానికి భూమి అప్పగింత**
**- ఆక్రమణదారులపై కఠిన చర్యలకు హెచ్చరిక**



**జనగామ, జూలై 28 (మన విశ్వం ):** జనగామ జిల్లా చిల్పూర్ గ్రామంలో రూ.3.5 కోట్లకు పైగా విలువైన ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు తిరిగి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకొచ్చారు. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశాల మేరకు చేపట్టిన ఈ చర్యతో ప్రభుత్వ భూముల పరిరక్షణకు మరో కీలక ముందడుగు పడింది. చిల్పూర్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 229లో సుమారు 36 ఎకరాల సీలింగ్ భూములు ప్రభుత్వ ఆధీనంలో ఉన్నాయి. అయితే గతంలో రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా మూడు ఎకరాల 12 గుంటల ప్రభుత్వ భూమిని ఒక ప్రైవేట్ రెడీమిక్స్ ప్లాంటు యాజమాన్యం 2019 నుంచి అక్రమంగా ఆక్రమించి వినియోగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు.

సమగ్ర పరిశీలన అనంతరం సంబంధిత భూమి ప్రభుత్వానికి చెందినదేనని నిర్ధారించిన అధికారులు, ఈ నెల 20న దానిని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని ఉత్తర్వులు జారీ చేశారు. ఆ మేరకు రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టి ఆక్రమణలో ఉన్న భూమిని స్వాధీనం చేసుకున్నారు.

తరిగొప్పుల--చిన్న పెండ్యాల ప్రధాన రహదారిపై ఈ భూమి ఉండటంతో దాని మార్కెట్ విలువ రూ.3.5 కోట్లకు పైగా ఉంటుందని అధికారులు తెలిపారు. ప్రభుత్వ ఆస్తిని తిరిగి స్వాధీనం చేసుకోవడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వ భూములను ఆక్రమించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు రెవెన్యూ యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉంటుందని, ఎక్కడైనా ప్రభుత్వ భూములపై అక్రమాలు గుర్తిస్తే వెంటనే చర్యలు చేపడతామని స్పష్టం చేశారు.

# తాజా కిచెన్‌లో అధికారుల తనిఖీ

**- ఆహార భద్రత ప్రమాణాలపై అధికారుల పరిశీలన**
**- పరిశుభ్రత నిర్వహణకు ప్రశంసలు**
**- డ్రెయిన్ మెష్ ఏర్పాటు చేయాలని సూచన**
**- 95 శాతం భద్రతా ప్రమాణాల సాధన**




**హైదరాబాద్, జూలై 28 (మన విశ్వం ):** మాదాపూర్‌లోని తాజా కిచెన్‌లో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఆహార భద్రత అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఆహార భద్రత, పరిశుభ్రత ప్రమాణాలను పరిశీలించేందుకు చేపట్టిన ఈ తనిఖీల్లో వంటశాల నిర్వహణ, ఆహార పదార్థాల నిల్వ, సిబ్బంది భద్రతా ప్రమాణాలు, పరిశుభ్రత వంటి అంశాలను అధికారులు సమగ్రంగా పరిశీలించారు. వినియోగదారులకు సురక్షితమైన ఆహా రం అందించేందుకు నిబంధనల అమలుపై ప్రత్యేక దృష్టి సారించారు. తనిఖీల సందర్భంగా పలు అంశాల్లో సంస్థ సంతృప్తికరమైన ప్రమాణాలను పాటిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఆహార తయారీలో పాల్గొనే సిబ్బంది తల కవర్లు, చేతి తొడుగులు ధరించడం, తాగునీటి నాణ్యత పరీక్షల వివరాలు, సిబ్బంది వైద్య ఆరోగ్య ధ్రువీకరణ పత్రాలు అందుబాటులో ఉండడం వంటి అంశాలను పరిశీలించారు. ఆహార తయారీలో కృత్రిమ రంగులు, అజినోమోటో వంటి పదార్థాలను ఉపయోగించడం లేదని అధికారులు నిర్ధారించారు.ఆహార భద్రతకు సంబంధించిన శిక్షణ పొందిన పర్యవేక్షకులు అందుబాటులో ఉండటం, పాత లేదా గడువు ముగిసిన ఆహార పదార్థాలు లేకపోవడం, క్రిమికీటకాల ఆనవాళ్లు కనిపించకపోవడం వంటి అంశాలను అధికారులు ప్రశంసించారు. వంటశాల శుభ్రతను క్రమం తప్పకుండా నిర్వహించడం, క్రిమి సంహార చర్యలు చేపట్టడం, పాత్రలను వేడి నీటితో శుభ్రపరిచి క్రిమిరహితం చేయడం, ముడి సరుకులకు సరైన గుర్తింపు వివరాలు ఉంచడం వంటి చర్యలు సక్రమంగా అమలవుతున్నట్లు గుర్తించారు. అయితే డ్రెయిన్ వద్ద రక్షణ మెష్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని అధికారులు సూచించారు. ఈ అంశాన్ని వెంటనే సరిచేసి ఆహార భద్రతా ప్రమాణాలను మరింత మెరుగుపరచాలని సంస్థ యాజమాన్యానికి సూచనలు జారీ చేశారు. గుర్తించిన లోపాన్ని సవరించేందుకు మెరుగుదల నోటీసును అందజేసినట్లు అధికారులు వెల్లడించారు. తనిఖీల్లో ఆహార భద్రత ప్రమాణాల మూల్యాంకనంలో సంస్థకు 92 మార్కులకు గాను 87 మార్కులు లభించాయి. ఇది సుమారు 95 శాతం ప్రమాణాలను సాధించి నట్లుగా అధికారులు పేర్కొన్నారు. అయినప్పటికీ మిగిలిన లోపాలను కూడా సరిచేసి పూర్తిస్థాయి ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన ఆహారం అందించడం లక్ష్యంగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హోటళ్లు, రెస్టారెంట్లు, ఆహార తయారీ కేంద్రాల్లో ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని అధికారులు తెలిపారు. ఆహార భద్రత నిబంధనలను పాటించని సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, ప్రమాణాలు పాటించే సంస్థలను ప్రోత్సహించే విధానాన్ని కొనసాగి స్తామని వెల్లడించారు.

# రైతు నేస్తం కార్యక్రమంలో ఉత్తమ అధికారులకు సత్కారం

**- ఉట్నూర్ రైతు వేదిక నుంచి 100వ ఎపిసోడ్‌లో పాల్గొన్న కలెక్టర్**
**- ఆదర్శ రైతులు, వ్యవసాయ అధికారులకు సన్మానం**
**- రైతులకు మొక్కల పంపిణీ, ప్రదర్శన శాలల సందర్శన**
**- వ్యవసాయాభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలని పిలుపు**




**ఆదిలాబాద్, జూలై 28 (మన విశ్వం ):** రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'రైతు నేస్తం' 100వ ఎపిసోడ్ కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మంగళవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని రైతు వేదిక నుంచి నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, అధికారులు, రైతులతో కలిసి కలెక్టర్ వర్చువల్ సమావేశంలో పాల్గొని రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వ్యవసాయ శాఖ అధికారులను, ఆదర్శ రైతులను కలెక్టర్ రాజర్షి షా, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మెమెంటోలు అందజేసి అభినందించారు. వ్యవసాయ రంగంలో విశేష సేవలు అందిస్తున్న అధికారులు, రైతులను ప్రోత్సహించడం ద్వారా ఇతరులకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు. వ్యవసాయాభివృద్ధికి అందరూ సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.
కార్యక్రమం అనంతరం రైతులకు మొక్కలను పంపిణీ చేశారు. అలాగే రైతు వేదికలో ఏర్పాటు చేసిన వ్యవసాయ ప్రదర్శన శాలలను సందర్శించి వివిధ వ్యవసాయ సాంకేతికతలు, పరికరాలు, పంటల నిర్వహణకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఉపయోగపడే ఆధునిక విధానాలను విస్తృతంగా అందుబాటు లోకి తీసుకురావాలని సూచించారు. వ్యవసాయ రంగంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం, శాస్త్రీయ సాగు పద్ధతులను అనుసరించడం ద్వారా రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని కార్యక్రమంలో అధికారులు వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతు వేదికలను వ్యవసాయ విజ్ఞాన కేంద్రాలుగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో ఆర్డీవో మోహన్ సింగ్, జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్, తహసీల్దార్ రఘునాథ్, ఎంపీడీవో రైసుద్దీన్, సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీధర్, రామ్ కిషన్, ప్యాక్స్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, సర్పంచ్ అనితతో పాటు వ్యవసాయ, ఉద్యానవన, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది, రైతులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రైతుల అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు పేర్కొన్నారు. వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికత, శాస్త్రీయ పద్ధతులు, ప్రభుత్వ సహాయ కార్యక్రమాలను రైతులకు మరింత చేరువ చేసి వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు.

# వక్ఫ్ భూముల పరిరక్షణకు సమన్వయంతో పనిచేయాలి: జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్, జూలై 28(మన విశ్వం):** జిల్లాలో వక్ఫ్ భూముల పరిరక్షణకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి అక్రమ ఆక్రమణలను అరికట్టేందుకు సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు.
మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వక్ఫ్ పరిరక్షణ మరియు సమన్వయ కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ, పెండింగ్‌లో ఉన్న అంశాలు, భూముల రికార్డుల నిర్వహణ, ఆక్రమణల నివారణ, శాఖల మధ్య సమన్వయంపై సమీక్ష నిర్వహించారు.
వక్ఫ్ భూములకు సంబంధించిన ప్రతి అంశాన్ని చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా పరిష్కరించాలని, రెవెన్యూ, పోలీసు, మున్సిపల్, సర్వే, రిజిస్ట్రేషన్ తదితర శాఖలు పరస్పర సహకారంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. వక్ఫ్ ఆస్తులకు సంబంధించిన ఫిర్యాదులపై వెంటనే స్పందించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి సంధ్యారాణి అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్, ఈస్ట్ జోన్ డిసిపి అంకిత్ కుమార్, మున్సిపల్ కమిషనర్ వెంకన్న, జిల్లా రెవెన్యూ అధికారి విజయ లక్ష్మి, వరంగల్ నర్సంపేట ఆర్డీవోలు సుమ, ఉమారాణిలు జిల్లా మైనారిటీల సంక్షేమ అధికారి రమేష్, జిల్లా రిజిస్ట్రార్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారి శ్రీనివాస్ లు, వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ ఆడిటర్ తదితర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# పట్నం కుటుంబాన్ని పరామర్శించిన హరీశ్‌రావు




**- షాబాద్‌లోని నివాసానికి వెళ్లి సంతాపం తెలిపిన మాజీ మంత్రి**
**- రుక్కమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పింపు**
**- పట్నం నరేందర్ రెడ్డి, మహేందర్ రెడ్డిని ఓదార్చిన హరీశ్‌రావు**

**రంగారెడ్డి, జూలై 28 (మన విశ్వం ):** కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి, శాసన మండలి ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డిల మాతృమూర్తి పట్నం రుక్కమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన నేపథ్యంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభ ఉపనేత హరీశ్‌రావు షాబాద్‌లోని వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాతృవియోగంతో తీవ్ర విషాదంలో ఉన్న కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు పట్నం రుక్కమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. కుటుంబ సభ్యులతో కొంతసేపు మాట్లాడి వారి దుఃఖాన్ని పంచుకున్నారు. ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని వారికి సూచించారు. మాతృవియోగంతో తీవ్ర వేదనలో ఉన్న పట్నం నరేందర్ రెడ్డి, మహేందర్ రెడ్డిలను హరీశ్‌రావు ప్రత్యేకంగా ఓదార్చారు. కుటుంబానికి అండగా పార్టీ ఎల్లప్పుడూ ఉంటుందని భరోసా కల్పించారు. రుక్కమ్మ కుటుంబ సభ్యులకు అందించిన విలువలు, సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. పరామర్శ కార్యక్రమంలో మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్, వి. శ్రీనివాస్ గౌడ్, లక్ష్మారెడ్డితో పాటు మాజీ ఎంపీ మాలోత్ కవిత కూడా పాల్గొన్నారు. బీఆర్ఎస్‌కు చెందిన పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు కూడా హాజరై కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. పరామర్శకు వచ్చిన నాయకులు రుక్కమ్మ మృతిపట్ల తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు ఈ లోటును భరించే శక్తిని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు. ఆమె జ్ఞాపకాలు కుటుంబ సభ్యులకు ఎప్పటికీ మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. పరామర్శ అనంతరం హరీశ్‌రావు, ఇతర నాయకులు కుటుంబ సభ్యులతో మరికొంతసేపు మాట్లాడి ధైర్యం చెప్పారు. ఈ క్లిష్ట సమయంలో అందరూ అండగా ఉంటారని హామీ ఇచ్చారు. రుక్కమ్మకు ఘనంగా నివాళులర్పించిన అనంతరం నాయకులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

# ముడుమాల్ నిలువురాళ్లకు మరింత గుర్తింపు

**- నిలువురాళ్ల పార్కు అభివృద్ధి పనులకు శంకుస్థాపన**
**- వారసత్వ సంపద పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం**
**- యునెస్కో శాశ్వత గుర్తింపు కోసం కృషి**
**- పర్యాటకాభివృద్ధితో స్థానికులకు ఉపాధి అవకాశాలు: మంత్రి వాకిటి శ్రీహరి**



**నారాయణపేట, జూలై 28 (మన విశ్వం ):** చారిత్రక, సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని రాష్ట్ర క్రీడలు, పాడి పరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గంలోని ముడుమాల్ గ్రామంలో ఉన్న చారిత్రక నిలువురాళ్ల పార్కు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పార్కు అభివృద్ధి పనులను పరిశీలించిన మంత్రి, ఈ ప్రాంతాన్ని రాష్ట్రంలోనే ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. మంత్రి మాట్లాడుతూ చారిత్రక, సాంస్కృతిక వారసత్వ సంపదను కాపాడడంతో పాటు పర్యాటక కేంద్రాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ముడుమాల్ నిలువురాళ్ల పార్కును మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్ది, సందర్శకులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించేలా అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. పార్కులో రహదారులు, తాగునీరు, విశ్రాంతి సౌకర్యాలు, సమాచార కేంద్రాలు, సందర్శకుల సౌలభ్యానికి అవసరమైన ఏర్పాట్లు చేయనున్నట్లు వివరించారు.
ఈ అభివృద్ధి పనులు పూర్తయిన తర్వాత ముడుమాల్ నిలువురాళ్ల పార్కుకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు లభిస్తుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. పర్యాటకుల రాక పెరగడంతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు విస్తరించడంతో పాటు గ్రామ ఆర్థికాభివృద్ధికి కూడా ఊతం లభిస్తుందని తెలిపారు. పర్యాటక రంగాన్ని గ్రామీణాభివృద్ధికి అనుసంధానం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్ వేద కుమార్ మాట్లాడుతూ ముడుమాల్ నిలువురాళ్లకు యునెస్కో ప్రపంచ వారసత్వ తాత్కాలిక జాబితాలో స్థానం లభించడం తెలంగాణకు గర్వకారణమని అన్నారు. యునెస్కో శాశ్వత గుర్తింపు సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కేంద్రానికి ప్రతిపాదనలు పంపిందని తెలిపారు. యునెస్కో సూచించిన ప్రమాణాలను పూర్తిస్థాయిలో అమలు చేసి శాశ్వత గుర్తింపు సాధించే దిశగా కృషి చేయాలని సూచించారు. నిలువురాళ్ల ప్రాంతాన్ని పరిరక్షించేందుకు గతంలో జిల్లా అధికారులు తీసుకున్న చర్యలను కూడా ఆయన గుర్తు చేశారు.
ముడుమాల్ చారిత్రక విశిష్టతను విద్యార్థులకు పరిచయం చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నామని వేద కుమార్ తెలిపారు. జిల్లాలోని 400 పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు శిక్షణ ఇచ్చి సుమారు 60 వేల మంది విద్యార్థులు నిలువురాళ్లను సందర్శించేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు చెప్పారు. అలాగే 20 మంది పర్యాటక మార్గదర్శకులను నియమించి సందర్శకులకు ఈ ప్రాంత చరిత్ర, ప్రాముఖ్యతను వివరించే ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ఇందుకోసం ప్రత్యేక పర్యాటక మ్యాప్‌ను కూడా రూపొందించనున్నట్లు వెల్లడించారు. మూడువేల సంవత్సరాల క్రితమే ఖగోళ పరిజ్ఞానాన్ని ప్రతిబింబించేలా నిలువురాళ్ల నిర్మాణం జరిగినట్లు శాస్త్రీయ అధ్యయనాలు సూచిస్తున్నాయని వేద కుమార్ పేర్కొన్నారు. ఆధునిక శాస్త్ర విజ్ఞానం అందుబాటులోకి రాకముందే నక్షత్ర మండలాల ఆధారంగా ఈ నిర్మాణాలు చేపట్టడం మన పూర్వీకుల మేధస్సుకు నిదర్శనమన్నారు. ప్రభుత్వ శాఖలు, స్థానిక ప్రజలు, నిపుణులు కలిసి ఈ వారసత్వ సంపదను ప్రపంచానికి పరిచయం చేసేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. యునెస్కో శాశ్వత గుర్తింపు సాధిస్తే తెలంగాణ పర్యాటక రంగానికి ఇది మరింత ప్రతిష్ఠను తీసుకువస్తుందని అభిప్రాయపడ్డారు.

# రైతునే రాజుగా తీర్చిదిద్దే రైతునేస్తం : మంత్రి తుమ్మల

**- సచివాలయంలో ఘనంగా రైతునేస్తం 100వ ఎపిసోడ్ కార్యక్రమం**
**- 1,600 రైతువేదికల ద్వారా లక్షలాది మంది రైతుల భాగస్వామ్యం**
**- రైతు--శాస్త్రవేత్త--అధికారుల అనుసంధానానికి దేశంలోనే తొలి డిజిటల్ వేదిక**
**- ఎల్-నినో సవాళ్లను ఎదుర్కోవడంలో రైతునేస్తం కీలకమన్న మంత్రి**




**హైదరాబాద్, జూలై 28 (మన విశ్వం ):** రాష్ట్ర రైతులకు ఆధునిక వ్యవసాయ సాంకేతికతను చేరవేయడం, శాస్త్రవేత్తల సలహాలను నేరుగా అందుబాటులోకి తీసుకురావడమే రైతునేస్తం కార్యక్రమం ప్రధాన లక్ష్యమని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. హైదరాబాద్ సచివాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించిన రైతునేస్తం 100వ ఎపిసోడ్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, ప్రజాప్రతినిధులు, ఆదర్శ రైతులు పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1,600 రైతువేదికల ద్వారా లక్షలాది మంది రైతులు ప్రత్యక్షంగా ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ రైతునేస్తం రైతులకు ఎంతో ఉపయోగకరమైన డిజిటల్ వేదికగా నిలిచిందన్నారు. రైతులు నేరుగా శాస్త్రవేత్తలతో మాట్లాడి తమ సందేహాలను నివృత్తి చేసుకునే అవకాశం కల్పించడం దేశంలోనే వినూత్న ప్రయత్నమని ప్రశంసించారు. ఎల్-నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని వ్యవసాయశాఖ రూపొందించిన ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళిక ప్రకారం రైతులకు విత్తనాలు, సాంకేతిక సలహాలు, అవసరమైన సహాయం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రైతుల అవసరాలకు అనుగుణంగా ప్రతి రైతువేదికను విజ్ఞాన కేంద్రంగా తీర్చిదిద్దడంలో అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ గతంలో నిరుపయోగంగా మారిన రైతువేదికలను వీడియో కాన్ఫరెన్స్ సదుపాయాలతో ఆధునికీకరించి రైతునేస్తం కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు వివరించారు. రైతులు, శాస్త్రవేత్తలు, అధికారులు ఒకే వేదికపై ప్రత్యక్షంగా చర్చించుకునే అవకాశాన్ని కల్పించడం ద్వారా శాస్త్రీయ వ్యవసాయంపై అవగాహన పెంపొందించడం ఈ కార్యక్రమం ఉద్దేశమని చెప్పారు. 2024 మార్చి 6న ప్రారంభమైన రైతునేస్తం నేటితో 100 ఎపిసోడ్లు పూర్తి చేసుకోవడం రైతుల విశ్వాసానికి నిదర్శనమన్నారు. ఇప్పటివరకు 24,85,581 మంది రైతులు ప్రత్యక్షంగా పాల్గొనగా, వారిలో 5,26,107 మంది మహిళా రైతులు ఉన్నారని తెలిపారు. రెండేళ్లలో 27 లక్షలకుపైగా రైతులు ఈ కార్యక్రమం ద్వారా ప్రయోజనం పొందినట్లు వెల్లడించారు. ప్రతి మంగళవారం ఉదయం నిర్వహించే రైతునేస్తం ద్వారా రైతులు అడిగే ప్రశ్నలకు అదే సమయంలో శాస్త్రవేత్తలు సమాధానాలు అందిస్తున్నారని మంత్రి తెలిపారు. దీనివల్ల పంటలకు సమస్యలు తలెత్తకముందే నివారణ చర్యలు తీసుకునే అవకాశం రైతులకు లభిస్తోందన్నారు. ప్రపంచ స్థాయి పోటీని ఎదుర్కొనే వ్యవసాయం కోసం సాంకేతిక పరిజ్ఞానం అత్యవసరమని పేర్కొంటూ, వాతావరణ పరిస్థితులు, మార్కెట్ అవసరాలు, నీటి లభ్యతను పరిగణనలోకి తీసుకొని పంటల ఎంపిక చేసుకోవాలని సూచించారు. రైతునేస్తం ద్వారా వాతావరణ హెచ్చరికలు, జిల్లాల వారీగా అనువైన పంటలు, శాస్త్రీయ సాగు విధానాలపై నిరంతరం అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ఎల్-నినో ప్రభావం, ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న యుద్ధ పరిస్థితులు వ్యవసాయ రంగంపై ప్రభావం చూపే అవకాశాలు ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితులను ప్రభుత్వం, రైతులు కలిసి సమర్థవంతంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో నీటి కొరత మరింత పెరిగే అవకాశం ఉన్నందున అధిక నీటి అవసరమయ్యే పంటల కంటే ఆయిల్ పామ్, ఉద్యాన పంటలు, తక్కువ నీటితో సాగయ్యే పంటలను ప్రోత్సహించాలని సూచించారు. భారత వాతావరణ శాఖ అంచనాల ప్రకారం ఉత్తర తెలంగాణలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నప్పటికీ, చెరువులు, ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో నిండే పరిస్థితి లేదని, అందువల్ల రైతులు వరి సాగును విచక్షణారహితంగా విస్తరించవద్దని హెచ్చరించారు. జూలైలో సాధారణం కంటే 27 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని, సెప్టెంబరులో కూడా వర్షాలు తగ్గే అవకాశం ఉందని వివరించారు. కార్యక్రమంలో పలువురు ఆదర్శ రైతులు తమ అనుభవాలను పంచుకున్నారు. తక్కువ నీటితో అధిక ఆదాయం అందించే శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులు రైతునేస్తం ద్వారా నేర్చుకున్నామని తెలిపారు. ఆయిల్ పామ్ సాగు, ప్రకృతి వ్యవసాయం, తక్కువ నీటితో అధిక దిగుబడులు సాధించే విధానాలపై తమ విజయగాథలను ఇతర రైతులతో పంచుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న డిజిటల్ సేవలు, యూరియా వినియోగ నియంత్రణ చర్యలు, శాస్త్రవేత్తల ప్రత్యక్ష సలహాలు రైతులకు ఎంతో మేలు చేస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమం ముగింపులో వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఆదర్శ రైతులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఘనంగా సన్మానించగా, ప్రతి జిల్లాకు చెందిన ఐదుగురు ఆదర్శ రైతులకు ప్రత్యేకంగా గుర్తింపు అందించారు.

# ఇండస్ట్రియల్ కారిడార్‌కు భూముల అంగీకారం

**- 209 ఎకరాల భూసేకరణకు రైతుల సమ్మతి**
**- పరిహారం పెంపుతో 43 మంది రైతుల అంగీకారం**
**- చెట్లు, పంటలకు అదనపు నష్టపరిహారం**
**- భూములు కోల్పోయిన వారికి సహాయ చర్యల పరిశీలన:**
**- జిల్లా కలెక్టర్ ప్రియాంక**




**నారాయణపేట, జూలై 28 (మన విశ్వం ):** కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గి మండలం తోగాపూర్ గ్రామంలో ప్రతిపాదిత ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు అవసరమైన భూసేకరణ ప్రక్రియలో కీలక ముందడుగు పడింది. ప్రాజెక్టుకు అవసరమైన 209 ఎకరాల భూములను అప్పగించేందుకు రైతులు అంగీకారం తెలిపినట్లు జిల్లా యంత్రాంగం వెల్లడించింది. ఈ మేరకు జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ప్రియాంక అధ్యక్షతన జిల్లా స్థాయి నెగోషియేషన్ కమిటీ సమావేశం నిర్వహించి భూసేకరణ, సమ్మతి అవార్డు, నష్టపరిహారం అంశాలపై రైతులతో విస్తృతంగా చర్చించారు. సమావేశం ప్రారంభంలో జిల్లా యంత్రాంగం నిర్ణయించిన నష్టపరిహారం రేటుపై రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రస్తుత మార్కెట్ విలువతో పోలిస్తే పరిహారం తక్కువగా ఉందని పేర్కొంటూ దానిని పెంచాలని కలెక్టర్‌ను కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ మార్కెట్ విలువకు అనుగుణంగా పరిహారం అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో సమావేశానికి హాజరైన 43 మంది రైతులు భూసేకరణకు అంగీకారం తెలిపారు. అనంతరం వారు సమ్మతి పత్రాలపై సంతకాలు చేసి భూముల అప్పగింతకు తమ అంగీకారాన్ని నమోదు చేశారు. ఇంకా అంగీకారం తెలపని రైతులతో కూడా చర్చించి వారిని ఒప్పించి భూముల అప్పగింత ప్రక్రియను పూర్తి చేస్తామని తోగాపూర్ గ్రామ సర్పంచ్ హామీ ఇచ్చారు. పరిశ్రమల కారిడార్ ఏర్పాటుతో ప్రాంత అభివృద్ధి, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అధికారులు రైతులకు వివరించారు. భూసేకరణ ప్రక్రియను పరస్పర అవగాహనతో పూర్తి చేసే దిశగా జిల్లా యంత్రాంగం కృషి చేస్తోందని సమావేశంలో పేర్కొన్నారు. సమావేశంలో కొందరు రైతులు తమ వ్యవసాయ భూములన్నీ భూసేకరణలోకి వెళ్తున్నాయని, దీంతో జీవనాధారం కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ ముందుగా నష్టపరిహారం స్వీకరించి, మూడు రోజుల్లో సమ్మతి అవార్డుకు అంగీకారం తెలపాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరు విషయంలో ప్రభుత్వం నిర్దేశించిన అర్హత ప్రమాణాల ప్రకారమే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. భూములకు చెల్లించే నష్టపరిహారంతో పాటు భూమిలో ఉన్న చెట్లు, పంటలు, బోరుబావులు, షెడ్లు తదితర ఆస్తులకు కూడా నిబంధనల మేరకు అదనపు పరిహారం అందజేస్తామని కలెక్టర్ తెలిపారు. భూములు కోల్పోయే రైతులు ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రభుత్వం తరఫున సాధ్యమైన అన్ని సహాయ చర్యలు, ప్రత్యామ్నాయ అవకాశాలను పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి అంశాన్ని న్యాయబద్ధంగా పరిష్కరిస్తామని పేర్కొన్నారు.
జిల్లా అభివృద్ధికి పరిశ్రమల ఏర్పాటుతో పాటు రైతుల ప్రయోజనాల పరిరక్షణకు కూడా సమాన ప్రాధాన్యం ఇస్తున్నామని జిల్లా యంత్రాంగం వెల్లడించింది. భూసేకరణ ప్రక్రియను పారదర్శకంగా, రైతుల సమ్మతితో పూర్తి చేయడమే లక్ష్యమని అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, టీజీఐఐసీ జోనల్ మేనేజర్ రఫిక్, ఆర్ అండ్ బీ కార్యనిర్వాహక ఇంజనీర్ వెంకటరమణ, తహసీల్దార్ బక్క శ్రీను, తోగాపూర్ గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సేవలే పోలీసుల ప్రధాన ధ్యేయం

**– వనస్థలిపురం ఏసీపీ కార్యాలయాన్ని తనిఖీ చేసిన కమిషనర్ కార్యాలయ నిర్వహణ, రికార్డులపై సమగ్ర సమీక్ష**
**– ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి**
**– ప్రజాకేంద్రిత సేవలు అందించాలని అధికారులకు ఆదేశం**




**హైదరాబాద్, జూలై 28 (మన విశ్వం):** ప్రజలకు మరింత నాణ్యమైన, వేగవంతమైన పోలీసు సేవలు అందించడమే లక్ష్యంగా మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి వనస్థలి పురం ఏసీపీ కార్యాలయాన్ని మంగళవారం తనిఖీ చేశారు. కార్యాలయ పనితీరు, ప్రజలకు అందుతున్న సేవలు, పెండింగ్ వ్యవహారాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించి అధికారులకు పలు సూచనలు చేశారు. తనిఖీలో భాగంగా కార్యాలయ నిర్వహణ, రికార్డుల నిర్వహణ, భద్రపరిచే విధానం, కేసుల పురోగతి, పెండింగ్ అంశాల పరిష్కారంపై కమిషనర్ ప్రత్యేకంగా ఆరా తీశారు. అన్ని రికార్డులను నిబంధనలకు అనుగుణంగా నిర్వహించడంతో పాటు కార్యాలయ పనితీరులో పారదర్శకత, క్రమశిక్షణ పాటించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదులను వేగంగా పరిష్కరించేందుకు సమర్థమైన విధానాలను అమలు చేయాలని కమిషనర్ సూచించారు. ప్రతి ఫిర్యాదును బాధ్యతాయుతంగా స్వీకరించి, నిర్ణీత సమయంలో పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రజలు పోలీసు శాఖపై మరింత విశ్వాసం పెంచుకునేలా సేవల నాణ్యతను మెరుగుపరచాలని సూచించారు. ప్రతి అధికారి ప్రజాకేంద్రిత దృక్పథంతో విధులు నిర్వహించాలని కమిషనర్ స్పష్టం చేశారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించడం, వారి సమస్యలను ఓర్పుతో వినడం, చట్టపరమైన పరిష్కారాన్ని వేగంగా అందించడం పోలీసు శాఖ బాధ్యత అని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా కార్యాలయ వ్యవస్థను మరింత సమర్థంగా నిర్వహించాలని ఆదేశించారు .కార్యాల యాల్లో క్రమానుగత తనిఖీలు నిర్వహించడం ద్వారా లోపాలను గుర్తించి వెంటనే సరిదిద్దే అవకాశం ఉంటుందని కమిషనర్ పేర్కొన్నారు. ఆధునిక పరిపాలనా విధానాలను అమలు చేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రతి అధికారి కృషి చేయాలని సూచించారు. పెండింగ్ అంశాలను ఎప్పటికప్పుడు తగ్గిస్తూ పనితీరును మెరుగుపరచాలని ఆదేశించారు. ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయడమే మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ ప్రధాన లక్ష్యమని కమిషనర్ తెలిపారు. ప్రజా సేవలకు ప్రాధాన్యం ఇస్తూ పారదర్శక, బాధ్యతాయుత, సమర్థవంతమైన పోలీసింగ్‌ను అందించేందుకు అన్ని స్థాయిల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆమె సూచించారు.

# నేనెక్కడికి పారిపోలేదు.. ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి క్లారిటీ



**హైదరాబాద్:** రాజేంద్రనగర్‌లోని జాతీయ పోలీస్ అకాడమీలో ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డిపై లైంగిక వేధింపుల కేసు సంచలనంగా మారిన విషయం తెలిసిందే. మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిణిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారనే ఆరోపణల నేపథ్యంలో ఉదయ్ కృష్ణారెడ్డికి నోటీసులు జారీ చేసేందుకు పోలీసులు సిద్ధమయ్యారు. 2 రోజులుగా ఉదయ్ కృష్ణారెడ్డికి పోలీసులు నోటీసులు ఇచ్చేందుకు ప్రయత్నిస్తుండగా.. హైదరాబాద్‌లోని రెండు అడ్రస్‌ల్లోనూ ఉదయ్ కృష్ణారెడ్డి కనిపించడం లేదని వార్తలు వచ్చాయి. పోలీసులు ఉదయ్ కృష్ణారెడ్డి స్టేట్‌మెంట్ రికార్డ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. పరారిలో ఉన్నాడని, ఫోన్ కూడా స్విచాఫ్ వస్తుందన్న వార్తల నేపథ్య ంలో ఉదయ్ కృష్ణారెడ్డి స్పందించాడు తాను ఎక్కడికీ పారిపోలేదని క్లారిటీ ఇచ్చాడు ఉదయ్ కృష్ణారెడ్డి . మా నానమ్మ అనారోగ్యంతో ఉన్నందుకు సొంతూరు ఊళ్లపాలెం వచ్చాను. న్యాయ, పోలీసు వ్యవస్థల మీద నమ్మకంతోనే విచారణకు హాజరవుతున్నా. నా నిర్దోషిత్వాన్ని నిరూపించుకుంటా. నా శాశ్వత చిరునామా ఊళ్లపాలెంకు ఎటువంటి నోటీసులు రాలేదని స్పష్టం చేశాడు. ఈ వ్యవ హారం కోర్టు పరిధిలో ఉంది కాబట్టి ఎక్కువ మాట్లాడలేనని పేర్కొన్నాడు ఉదయ్ కృష్ణారెడ్డి.

# వసంత్‌నగర్‌లో పౌర సమస్యలపై ప్రత్యేక దృష్టి

**– 'రోజుకు ఒక వార్డు' కార్యక్రమంలో కమిషనర్ పర్యటన**
**– వీధి దీపాలు, తాగునీరు, పారిశుద్ధ్యంపై సమీక్ష**



**హైదరాబాద్, జూలై 28 (మన విశ్వం):** పౌరులకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించడమే లక్ష్యంగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ చేపట్టిన 'రోజుకు ఒక వార్డు' కార్యక్రమంలో భాగంగా కమిషనర్ వసంత్‌నగర్ వార్డును సందర్శించారు. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని ఈ వార్డులో జోనల్ కమిషనర్, అదనపు కమిషనర్ (పారిశుద్ధ్యం), డిప్యూటీ కమిషనర్ తదితర అధికారులతో కలిసి పర్యటించి స్థానిక పరిస్థితులను పరిశీలించారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పర్యటన సందర్భంగా నివాస సంక్షేమ సంఘాల ప్రతినిధులతో కమిషనర్ ముఖాముఖి సమావేశం నిర్వహించారు. వార్డు పరిధిలో ప్రజలు ఎదుర్కొ ంటున్న పౌర సమస్యలను సంఘాల ప్రతినిధులు వివరించడంతో పాటు ప్రజా సేవలను మరింత మెరుగుపరిచేందుకు పలు సూచనలు చేశారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి సూచనను సంబంధిత అధికారులు నమోదు చేసుకుని అమలు దిశగా చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు.సమావేశంలో పనిచేయని వీధి దీపాలు, ఉద్యానవనాల్లో చిన్నారుల ఆట స్థలాల అభివృద్ధి, ఇంటింటికీ చెత్త సేకరణను మరింత పటిష్ఠం చేయడం వంటి అంశాలు ప్రధానంగా చర్చకు వచ్చాయి. అలాగే జేఎన్‌టీయూ––మియాపూర్ సేవా రహదారి అభివృద్ధి, తాగునీటి సరఫరా మెరుగుదల, భూగర్భ మురుగు పారుదల వ్యవస్థ బలోపేతంపై స్థానికులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి సమస్యను ప్రాధాన్య క్రమంలో పరిష్కరించాలని కమిషనర్ సంబంధిత శాఖల అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి నిర్ణీత గడువులో సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి వెంటనే చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. 'రోజుకు ఒక వార్డు' కార్యక్రమం ద్వారా అధికారులు నేరుగా ప్రజల మధ్యకు వెళ్లి సమస్యలను తెలుసుకోవడం వల్ల పరిష్కార ప్రక్రియ మరింత వేగవంతమవుతుందని కమిషనర్ అభిప్రాయపడ్డారు. ప్రజల భాగస్వామ్యంతోనే పట్టణాభివృద్ధి సాధ్యమని పేర్కొంటూ, నివాస సంక్షేమ సంఘాల సహకారం నగరాభివృద్ధికి ఎంతో కీలకమని అన్నారు. ప్రజలు కూడా తమ ప్రాంతాల అభివృద్ధిలో చురుకుగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రతి వార్డును క్రమం తప్పకుండా సందర్శిస్తూ స్థానిక సమస్యలను గుర్తించి పరిష్కరించే కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. పౌర సేవలను మరింత సమర్థవంతంగా అందించడం, మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, పరిశుభ్రమైన నగర నిర్మాణం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు వెల్లడించారు.

# అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ కోర్సుల ప్రవేశాలు ప్రారంభం



**హనుమకొండ చౌరస్తా, జూలై 28:** డా. బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ 2026--27 విద్యా సంవత్సరానికి బీఏ, బీకాం, బీఎస్సీ డిగ్రీ కోర్సుల ప్రవేశాలు ప్రారంభమైనట్లు వరంగల్ ప్రాంతీయ సంచాలకులు ప్రొఫెసర్ సుంకరి జ్యోతి తెలిపారు. ఇంటర్మీడియట్, ఓపెన్ ఇంటర్మీడియట్, 10o2 అర్హత కలిగిన విద్యార్థులతో పాటు రెండేళ్ల పాలిటెక్నిక్, ఐటీఐ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులు ప్రవేశాలకు అర్హులని పేర్కొన్నారు.డిగ్రీ ప్రవేశాల కోసం ఆధార్ కార్డు, గూజ, ఇంటర్మీడియట్ మార్కుల జాబితా, కుల ధ్రువీకరణ పత్రం (అవసరమైన వారికి), పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో సమీప ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని డా. బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అధ్యయన కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. ప్రవేశాలకు ఆగస్టు 7 చివరి తేదీగా నిర్ణయించినట్లు తెలిపారు. అభ్యర్థులు వెబ్‌సైట్‌లో ప్రవేశ నమోదు పూర్తి చేసి, తాము ఎంపిక చేసుకున్న అధ్యయన కేంద్రంలో సంబంధిత ధ్రువపత్రాల ను సమర్పించాలని వెల్లడించారు. మరిన్ని వివరాల కోసం టోల్‌ఫ్రీ నంబర్ 1800-599-0101, ఫోన్ నంబర్లు 040-23680333, 040-23680444, 040-23680555లను సంప్రదించాలని జ్యోతి కోరారు.

# నిండుకుండలా జూరాల ప్రాజెక్టు - ఎగువ నుంచి నీటి విడుదలతో జలకళ



**గద్వాల :** జోగులాంబ గద్వాల జిల్లాలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు జలకళను సంతరించుకుంది. కర్ణాటకలోని ఆలమట్టి, నారాయణపూర్ ప్రాజె క్టుల నుంచి నీటిని విడుదల చేయడంతో జూరా లలో నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. కృష్ణానదిపైనే ఈ ప్రాజెక్టును నిర్మించారు. జూరాల ప్రాజెక్టు పూర్తి నిల్వ సామర్థ్యం 9.66 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 8.989 టీఎంసీలకు చేరింది. ఎగువ ప్రాజెక్టుల నుంచి జూరాల జలాశయానికి 29,668 వేల క్యూసెక్కుల ప్రవాహం వస్తోందని అధికారులు తెలిపారు. 27,210 వేల క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నట్లు వివరించారు. నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ రిజర్వాయర్లకు ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని ఎత్తిపోస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన బీఆర్?ఎస్? మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు కర్ణాటకలోని గూడూరు ప్రాంతాన్ని సందర్శించిన సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై చేసిన విమర్శలను రాష్ట్ర క్రీడలు, పశుసంవర్ధక శాఖల మంత్రి వాకిటి శ్రీహరి సోమవారం ఒక ప్రకటన విడదల చేసి ఖండించారు. కృష్ణా నది జలాలపై మాట్లాడే హక్కు బీఆర్?ఎస్? పార్టీకి లేదని పేర్కొన్నారు. భారత రాష్ట్ర సమితి హయాంలో కర్ణాటకలో డ్యాంలు కట్టినప్పుడు ఎందుకు ప్రశ్నించలేదని మంత్రి నిలదీశారు.బీఆర్?ఎస్ పూర్తిగా నిర్లక్ష్యం చేసింది : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు పరిధిలోని రైతుల ప్రయోజనాలను గత బీఆర్?ఎస్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని మంత్రి వాకిటి శ్రీహరి మండిపడ్డారు. భీమా, కృష్ణా నదుల నీటిని నిల్వ చేసి సాగు, తాగునీరు అందించాలనే ఆలోచన కూడా చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందన్న ఆయన పొరుగు రాష్ట్రమైన కర్ణాటక ప్రభుత్వంతో సమన్వయం చేస్తూ కృష్ణా, భీమా నదులపై బ్యారేజీ-కమ్-బ్రిడ్జిల నిర్మాణానికి సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు వివరాలు సిద్ధం చేశామన్నారు. జూరాల ప్రాజెక్టు ముంపు గ్రామాలైన భూత్పూర్, అంకెనపల్లి, దాదంపల్లి, నేడుగం, అనుగొండ ప్రజల సమస్యలను దశాబ్దకాలంగా పట్టించుకోలేదని ఫైర్ అయ్యారు. ప్రస్తుతం ఆ గ్రామాల అభివృద్ధి, పునరావాసం, భూత్పూర్ డ్యాం విస్తరణ వంటి అంశాలపై తమ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని తెలిపారు. పాలమూరు జిల్లా ప్రజల భవిష్యత్తు కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుంటే, ప్లకార్డులు పట్టుకుని రాజకీయ డ్రామాలు చేయడం చేస్తే వారిని ప్రజలు నమ్మే పరిస్థితి లేదని వాకిటి పేర్కొన్నారు.సాగర్? ఆయకట్టు రైతుల్లో ఆందో ళన : మరోవైపు నాగార్జునసాగర్ ఆయకట్టు రైతులు జలాశయం వైపు ఆశగా ఎదురు చూ స్తున్నారు. నాగార్జునసాగర్ జలాశయం మొత్తం నీటి మట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుతం 513.10 అడుగులుగా ఉంది. ఇది డెడ్ స్టోరేజ్‌కు దగ్గరలో ఉందని అధికారులు చెబుతున్నారు. సాగర్ జలాశయం మొత్తం నీటి నిల్వ సామర్థ్యం 312.04 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 136 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. ప్రాజెక్టు ఎగువ నుంచి 900 క్యూసెక్కుల నీరు ఇన్?ఫ్లోగా వస్తుంది. హైదరాబాద్ తాగు నీటి కోసం 900 క్యూసెక్కుల నీటిని ఔట్?ఫ్లోగా విడుదల చేస్తున్నారు. ఎల్?నినో ప్రభావంతో సాగర్ ఆయకట్టు రైతులు పంటలకు సాగు నీరు వస్తుందా రాదా? అనే ఆందోళనలో ఉన్నారు. గత ఏడాది జులై మాసం చివరి నాటికి వర్షాలు అధికంగా కురవడంతో నాగార్జునసాగర్ ఎడమ కాలువకు సాగు నీటిని విడుదల చేశారని గుర్తు చేసుకుంటున్నారు.

# దూరు నుంచి జహీరాబాద్‌కు కొత్త రైల్వే లైన్



**జహీరాబాద్:** తాండూరు సిమెంట్ క్లస్టర్-జహీరాబాద్ మధ్య కొత్త రైల్వే లైన్ కోసం ఎంతో కాలంగా ఎదురుచూస్తున్నారు. తాజాగా దీని ఏర్పాటుకు కీలక ముందడుగు పడనుంది. ఈ రైల్వే లైన్‌కు సంబంధించిన క్షేత్రస్థాయి సర్వే ఇప్పటికే పూర్తయ్యింది. ప్రైవేటు ఏజెన్సీ ఆధ్వర్యంలో సమగ్ర సర్వే చేపట్టారు. సర్వే నివేదిక ప్రస్తుతం దక్షిణ మధ్య రైల్వే అధికారుల పరిశీలనలో ఉంది. ఈ ప్రాజెక్టుకు కేంద్రం నుంచి నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభం కానున్నాయి. ఈ కొత్తలైన్‌తో జహీరాబాద్ వాణిజ్య ముఖచిత్రం కూడా మారనుంది.గేట్ రహిత ప్రయాణం : ఈ రైలు మార్గం అంచనా వ్యయం రూ. 1,350 కోట్ల నుంచి రూ. 1,400 కోట్లుగా సర్వేలో తేల్చారు. ఈ రైల్వే లైన్‌ను సుమారు 70 నుంచి 75 కిలోమీటర్ల మేర నిర్మించనున్నారు. ఎక్కడా ట్రాఫిక్ సమస్యలు లేకుండా భవిష్యత్తులో ఈ మార్గం గుండా రైల్వే క్రాసింగ్ గేట్లు లేకుండా డిజైన్ చేశారు. వాహనాల రాకపోకలు కేవలం అండర్ బ్రిడ్జిలు, ఆర్వోబీల ద్వారానే సాఫీగా సాగేలా ప్రణాళికలు రూపొందించారు.స్టేషన్లు రానున్న ప్రాంతాలివే : ఈ కొత్త లైన్ ద్వారా పలు గ్రామాల్లో రైల్వే స్టేషన్లు ఏర్పాటు కానున్నాయి. ఎందుకంటే ఇది జహీరాబాద్, తాండూరు ప్రాంతాలను నేరుగా కలపనుంది. జహీరాబాద్, కోహీర్ మండలాల పరిధిలో శేఖాపూర్, మల్‌చెల్మ, గొడిగార్‌పల్లి, బడంపేటలో స్టేషన్ రానుంది. అలాగే వికారాబాద్ జిల్లాలో బంట్వారం, పెద్దేముల్, ఇందూరు, తట్టేపల్లి, కరణ్‌కోట, మల్కాపూర్, చల్కటూర్?లో రానుంది. అలాగే కర్ణాటకలోని కుంచవరం ప్రాంతాలను సైతం ఈ రైల్వేలైన్‌కు అనుసంధానం చేయనున్నారు.సరుకు రవాణాకు ఊతంగా : జహీరాబాద్ నుంచి తాండూరుకు రైలులో వెళ్లాలంటే ఇప్పుడు వికారాబాద్? మీదుగా వెళ్తున్నారు. దాదాపు 104 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది. అంటే సుమారు 3 గంటల సమయం పడుతోంది. ఈ కొత్త లైన్? రాకతో ప్రయాణ సమయం ఏకంగా గంటన్నర దాకా ఆదా కానుంది. ఒకవేళ రోడ్డు మార్గంలో వెళ్లాలంటే రెండు రాష్ట్రాలు, రెండు జిల్లాల సరిహద్దులు దాటుతూ వెళ్తున్నారు. ఈ రైల్వే లైన్‌తో ఆ ఇబ్బందులు కూడా తొలగిపోనున్నాయి.

# సాగర్ నీటితో చెరువులు నింపాలి



**అనంతగిరి, జూలై 28 :** సాగర్ నీరు ఖమ్మం జిల్లాకు తరలిపోతున్నా జిల్లా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చోద్యం చూస్తున్నారని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ విమర్శించారు. మంగళవారం అనంతగిరి మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. నీళ్లు, నిధులు, నియామకాలు ధ్యేయంగా స్వరాష్ట్ర సాధన జరిగిందని, సొంత రాష్ట్రంలో కూడా జిల్లాకు మొండి చేయి చూపి పాలేరుకు జలాలు తరలిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఉత్తమ్ దంపతులకు రైతుల గోస కనిపించడం లేదన్నారు. గతంలో కూడా జిల్లాలోని కాల్వ తూములను సీజ్ చేసి ఖమ్మం జిల్లాలకు నీటిని తరలించుకుపోయారని, తర్వాత వరద నీటితో తూముల్లో నీరు పారక కాల్వలకు గండ్లు, చెరువులు తెగిపోయి గ్రామాలు ముంపునకు గురైన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.

# మా దగ్గర తీసుకున్న కమీషన్ ఇచ్చేయండి




**హైదరాబాద్:** ఒకే పనికి రెండుసార్లు బిల్లులు చెల్లించిన అధి కారులకు ఇప్పుడు కాంట్రాక్టర్లు ఝలక్ ఇస్తున్నారు. అవినీతి జరిగినట్లు ఆలస్యంగా వెలుగులోకి రావడంతో అడ్డదారిలో వెళ్లిన ప్రజా ధనాన్ని రికవరీ చేయాలని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నిర్ణయించింది. అయితే రెండో బిల్లులో తీసుకున్న 10 శాతం కమీషన్ డబ్బును అధికారులూ తిరిగివ్వాలని కాంట్రా క్టర్లు పట్టుబడుతున్నారు. అలాగే జీహెచ్‌ఎంసీ అడుగుతున్న వడ్డీ డబ్బును చెల్లించలేమని చెబుతున్నారు.బల్దియా చరిత్రలో మొదటిసారి : కమీషన్, వడ్డీ డబ్బుతో కాంట్రాక్టర్లు రికవరీ ప్రక్రియపై మెలిక పెట్టడంతో శాఖాపరమైన చర్యల పేరుతో ఫైనాన్స్ విభాగం 78 మంది లైసెన్సులను హోల్డ్?లో పెట్టింది. ఆయా కాంట్రాక్టర్లకు ఇకపై జీహెచ్‌ఎంసీ ద్వారా బిల్లుల చెల్లింపు జరగకుండా ముందస్తుగా చర్యలు తీసుకుంది. జీహెచ్?ఎంసీ చరిత్రలో ఇంత మంది కాంట్రాక్టర్లపై ఒకేసారి చర్యలు తీసుకోవడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.కమిషనర్ లేఖలతో : అనారోగ్యం, తమ పిల్లల వివాహం, ఇతరత్రా అత్యవసర కారణాలు చూపుతూ తమకు వెంటనే బిల్లులు చెల్లించాలని అభ్యర్థిస్తూ కొందరు గుత్తేదారులు జీహెచ్?ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్??కు లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. దీంతో కొన్నింటిని కమిషనర్ పరిగణనలోకి తీసుకున్నారు. దీంతో ఆయా గుత్తేదారులకే రెండుసార్లు వర్క్? బిల్లుల చెల్లింపు జరిగింది. దీనికి కారణం కంప్యూటర్ ఆపరేటర్ చేతివాటమేనని తెలుస్తోంది.ఏళ్లకు ఏళ్లుగా ఫైనాన్స్ విభాగంలో పని చేస్తోన్న పొరుగు సేవల సిబ్బంది కమిషనర్ సిఫార్సును సొమ్ము చేసుకున్నాడు. కమిషనర్ సిఫార్సు లేఖ ఆయా కాంట్రాక్టర్ల బిల్లులను వరుస క్రమంలోనూ కొనసాగించారు.

# సీనియర్ సినీ నటి పావలా శ్యామల కన్నుమూత



ప్రముఖ సినీ నటి, క్యారెక్టర్ ఆర్టిస్ట్ పావలా శ్యామల కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె, హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. అర్ధరాత్రి దాటాక తీవ్రమైన గుండెపోటు రావడంతో మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ప్రస్తుతం ఆమె భౌతికకాయాన్ని ఉస్మానియా ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచారు. దాదాపు నాలుగు దశాబ్దాల పాటు సాగిన తన సినీ ప్రయాణంలో పావలా శ్యామల 250కి పైగా చిత్రాలలో నటించారు. 1985లో వచ్చిన 'బాబాయ్ అబ్బాయ్' చిత్రంతో వెండితెరకు పరిచయమైనప్పటికీ, కె. విశ్వనాథ్ దర్శకత్వంలోని 'స్వర్ణకమలం' సినిమాతో ఆమెకు మంచి గుర్తింపు లభించింది. ఆ తర్వాత 'ఖడ్గం', 'ఆంధ్రావాలా', 'అతడు', 'గోలీమార్' వంటి అనేక విజయవంతమైన చిత్రాల్లో తనదైన సహజ నటనతో, కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకులను అలరించారు.

ఏపీలోని గుంటూరు జిల్లా అమరావతిలో 1951లో జన్మించిన శ్యామల అసలు పేరు నేతి శ్యామల. నటనపై ఆసక్తితో తొలుత రంగస్థల నటిగా, రేడియో ఆర్టిస్ట్‌గా ప్రస్థానం ప్రారంభించారు. ఆమె నటించిన 'పావలా' అనే నాటకం విశేష ప్రజాదరణ పొందడంతో అదే ఆమె ఇంటిపేరుగా స్థిరపడిపోయింది. తన అమాయకత్వంతో కూడిన నటనతో తెలుగు ప్రేక్షకుల్లో చెరగని ముద్ర వేశారు. ఆమె మరణవార్తతో తెలుగు సినీ పరిశ్రమలో

# రామ్ చరణ్ కి సర్జరీ సక్సెస్..

## వైద్య బృందంతో ఆకట్టుకుంటున్న స్పెషల్ ఫోటో!



ప్రముఖ డైరెక్టర్ బుచ్చిబాబు సనా దర్శకత్వంలో రామ్ చరణ్ ఇటీవల నటించిన రూరల్ స్పోర్ట్స్ బ్యాక్ డ్రాప్ మూవీ పెద్ది. బాలీవుడ్ బ్యూటీ జాన్వి కపూర్ హీరోయిన్ గా నటించింది. జూన్ 4న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా రూ.400 కోట్ల క్లబ్లో చేరి సంచలన విజయం అందుకున్న విషయం తెలిసిందే. అయితే ఈ సినిమా షూటింగ్ సమయంలో ఆయన చేతి మణికట్టు వద్ద గాయమైంది. అయితే ఆ గాయం కారణంగా సినిమా షూటింగ్ నిలిపివేయకుండా ప్రమోషన్స్ లో కూడా పాల్గొని సినిమా పట్ల తనకున్న నిబద్ధతను నిరూపించుకున్నారు. ప్రస్తుతం విరామం దొరకడంతో తన భార్య ఉపాసన , తల్లిదండ్రులు మెగాస్టార్ చిరంజీవి, సురేఖ కొణిదెలతో కలిసి కోయంబత్తూర్ కి బయలుదేరిన రామ్ చరణ్ గంగా హాస్పిటల్ లో ప్రముఖ వైద్య బృందం సమక్షంలో సర్జరీ చేయించుకున్నారు. కొత్తసినిమాలు ఈ మేరకు సర్జరీ విజయవంతం అయింది. ఈ విషయాన్ని పెద్ది మూవీ మేకర్స్ అధికారికంగా దిగ్గజ వైద్య నిపుణులతో రామ్ చరణ్ కలిసి దిగిన ఫోటోని ప్రత్యేకంగా పంచుకుంటూ సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. "పెద్ది సినిమా షూటింగ్ సమయంలో రాంచరణ్ గాయపడినప్పటికీ నొప్పిని భరిస్తూ కీలకమైన సన్నివేశాల షూటింగ్ ను పూర్తి చేశారు. ఆయన వృత్తిపట్ల చూపిన అంకితభావం ఎంతో స్ఫూర్తిదాయకం" అని వృద్ధి సినిమాస్ కూడా పేర్కొంది. త్వరగా కోలుకొని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని చిత్ర బృందం ఆకాంక్షించింది. ఈ మేరకు పంచుకున్న ఫోటోలో రామ్ చరణ్ తో పాటు చేతి మణికట్టు వైద్య నిపుణులు అందరి దృష్టిని ఆకట్టుకుంటున్నారు. ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ ఎస్ రాజశేఖరన్, అంతర్జాతీయంగా పేరుపొందిన యూఎస్ మియామీకి చెందిన మణికట్టు స్పెషలిస్ట్ డాక్టర్ అలెంజాండ్రో బాడియా, డాక్టర్ ప్రవీణ్ భరద్వాజ్ లు.. సర్జరీ అనంతరం బెడ్ పై ఉన్న రామ్ చరణ్ తో కలిసి దిగిన ఫోటో ఇప్పుడు అందరి దృష్టిని ఆకట్టుకుంటుంది. నిపుణుల సమక్షంలో ఆయనకు సర్జరీ దిగ్విజయంగా పూర్తయిన సందర్భంగా అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తూ.. వైద్యులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. ఇటు రాంచరణ్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిసున్నారు.

## స్టన్నింగ్ మేకోవర్ : అగ్గి రాజేసిన రాశీ ఖన్నా లేటెస్ట్ ఫోటోషూట్



టాలీవుడ్, బాలీవుడ్‌లలో తనదైన నటన - గ్లామర్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కథానాయిక రాశీ ఖన్నా. సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉండే ఈ అందాల భామ... తన లేటెస్ట్ ఫొటోషూట్‌లతో అభిమానులను అలరిస్తుంటుంది. తాజాగా రాశీ తన ఇన్‌స్టాగ్రామ్ లో షేర్ చేసిన బ్లాక్ అండ్ బోల్డ్ లుక్ ఫోటోలు ప్రస్తుతం ఇంటర్నెట్‌ను షేక్ చేస్తున్నాయి. నలుపు రంగు దుస్తుల్లో రాశీ ఖన్నా ఒలికించిన సొగసులు అభిమానులను, నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ ప్రత్యేకమైన ఫొటోషూట్ కోసం ఈ దిల్లీ బ్యూటీ ధరించిన అవుట్‌ఫిట్... మేకప్ తన అందాన్ని మరింత రెట్టింపు చేశాయి. ఫర్ యువర్ రిఫరెన్స్! అనే క్యాప్షన్‌తో పాటు తన స్టైలిస్ట్ శీఫా జే గిలానీ, మేకప్, హెయిర్ అండ్ ఫొటోగ్రఫీ టీమ్‌కి కృతజ్ఞతలు తెలుపుతూ -టేక్స్ ఏ విలేజ్-అని పోస్ట్ చేశారు. బ్లాక్ డ్రెస్‌లో రాజసం ఉట్టిపడేలా రాశీ ఇచ్చిన ఫోజులు, స్టైలింగ్ న భూతో నభవిష్యతి అన్నట్లుగా ఉన్నాయని అభిమానులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ఈ ఫొటోలు పోస్ట్ చేసిన కొద్ది నిమిషాల్లోనే సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అందాల రాశీఖన్నా అభిమానులు, నెటిజన్లు వేల సంఖ్యలో లైకులు, కామెంట్లతో రీ-పోస్ట్‌లు చేస్తున్నారు.-నలుపు రంగు ఇంత అందంగా ఎప్పుడూ లేదు-, -బాలీవుడ్, టాలీవుడ్‌లలో ఒక కొత్త సంచలనం-,-10 అవుట్ ఆఫ్ 10- అంటూ నెటిజన్లు కామెంట్ల సెక్షన్‌లో హార్ట్, ఫైర్ ఎమోజీలతో రాశీ గ్లామర్‌ను ఆకాశానికెత్తేస్తున్నారు. గత కొన్ని రోజులుగా విభిన్నమైన పాత్రలను ఎంచుకుంటూ తన యాక్టింగ్ స్కిల్స్‌తో మెప్పిస్తున్న రాశీ ఖన్నా, ఇలాంటి ఫ్యాషన్ షూట్స్‌తో తన గ్లామర్ కోణాన్ని కూడా ఆవిష్కరిస్తోంది. ట్రెండ్‌కు తగ్గట్లుగా పర్ఫెక్ట్ ఫ్యాషన్ సెన్స్‌తో కనిపిస్తూ కుర్రకారు హృదయాలను కొల్లగొడుతోంది. ముఖ్యంగా యువతలోఈ బ్యూటీకి ఉన్న క్రేజ్ ఈ ఫొటోలకు వస్తున్న రెస్పాన్స్ చూస్తే స్పష్టంగా అర్థమవుతోంది.

## 'అబ్జెక్షన్ మై లార్డ్'ను చిరంజీవి మెచ్చుకున్నారు... చాలా హ్యాపీ!: శ్రీకాంత్



"మా 'అబ్జెక్షన్ మై లార్డ్' సిరీస్‌ను చూసి మెగాస్టార్ చిరంజీవిగారు చాలా బాగుందని మెచ్చుకోవడం ఎంతో సంతోషాన్ని ఇచ్చింది" అని ప్రముఖ నటుడు శ్రీకాంత్ అన్నారు. జీ5 ఓటీటీ వేదికగా రానున్న ఈ ఒరిజినల్ సిరీస్ ప్రివ్యూ ఈవెంట్‌లో ఆయన మాట్లాడుతూ ఈ విషయాన్ని పంచుకున్నారు. శ్రీకాంత్, అనన్య శర్మ, ముఖేష్ రిషి, స్నేహాల్, సమీర్ ప్రధాన పాత్రలలో నటించిన ఈ సిరీస్‌కు 'నోటరీ పరశురాం' అనేది ట్యాగ్‌లైన్. 7 ఎపిసోడ్ల ఎమోషనల్ కోర్ట్ రూమ్ డ్రామాగా రూపొందిన ఈ సిరీస్ జూలై 31 నుంచి జీ5లో స్ట్రీమింగ్ కానుంది. డ్రీమ్ హౌస్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాజ్‌కుమార్ ఆకెళ్ల నిర్మించగా, సంతోష్ అయ్యప్పన్ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ, "జీ5తో నాకు మంచి అనుబంధం ఉంది. వారితో ఇది నా మూడో వెబ్ సిరీస్. సినిమాల కన్నా సిరీస్‌లకు ఎక్కువ కష్టపడాలి, కానీ చాలా ఎంజాయ్ చేస్తూ పనిచేశాను. ఇందులో నాకు మంచి పాత్ర దొరికింది. దర్శకుడు సంతోష్ చాలా క్లారిటీతో ఈ సిరీస్‌ను అద్భుతంగా తీర్చిదిద్దారు. నిర్మాత రాజ్ కుమార్ ఎక్కడా రాజీ పడకుండా సపోర్ట్ చేశారు. సిరీస్ అవుట్‌పుట్ చూశాక మేమంతా ఫిదా అయ్యాం. ముఖేష్ రిషి గారు కేవలం నటుడే కాదు, స్వచ్ఛమైన మనసున్న వ్యక్తి. ఈ సిరీస్ కోసం అందరూ ఎంతో కష్టపడ్డారు. చిరంజీవి గారు కూడా చూసి బాగుందని చెప్పడంతో మా కష్టానికి తగ్గ ప్రతిఫలం దక్కినట్లయింది" అని తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. నటుడు ముఖేష్ రిషి మాట్లాడుతూ, "ఈ సిరీస్ కోసం శ్రీకాంత్ గారు రోజుకు 18 గంటలు పనిచేశారు. ఆయన డెడికేషన్ అమోఘం. జూలై 31న కుటుంబంతో కలిసి ఈ సిరీస్‌ను చూడండి" అని కోరారు. మరో నటుడు సమీర్ మాట్లాడుతూ, "ఇది వెబ్ సిరీస్ కాదు, ఒక వెబ్ ఫిలిం. శ్రీకాంత్ లాంటి ప్రొడ్యూసర్స్ హీరో లేకపోతే ఇది పూర్తయ్యేది కాదు. ఆయన ఒక డైరెక్టర్స్ యాక్టర్. జూలై 31న ప్రేక్షకులు ఒక విజువల్ ఫీస్ట్ చూడబోతున్నారు" అని అన్నారు. దర్శకుడు సంతోష్ అయ్యప్పన్ మాట్లాడుతూ, "ఈ సిరీస్ షూటింగ్‌ను కేవలం 19 రోజుల్లో పూర్తి చేశాం. శ్రీకాంత్ గారు, ముఖేష్ రిషి గారు, ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల సహకారం వల్లే ఇది సాధ్యమైంది. నిర్మాత రాజ్ కుమార్, జీ5 టీమ్ ఇచ్చిన స్వేచ్ఛతోనే ఇంత వేగంగా, నాణ్యంగా సిరీస్‌ను పూర్తి చేయగలిగాం" అని తెలిపారు.

## ఓటీటీలోకి వస్తున్న సత్యదేవ్ 'రావు బహదూర్'..




టాలీవుడ్ హీరో సత్యదేవ్ ప్రధాన పాత్రలో, ప్రశాంత్ కుమార్ డి దర్శకత్వంలో తెరకెక్కిన పీరియడ్ సోషల్ డ్రామా 'రావు బహదూర్' డిజిటల్ విడుదల తేదీ ఖరారైంది. సినీ అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న ఈ చిత్రం ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్‌లో జులై 31 నుంచి ప్రపంచవ్యాప్తంగా అందుబాటులోకి రానుంది. తెలుగు, తమిళ్, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో స్ట్రీమింగ్ కాబోతోంది. సూపర్ స్టార్ మహేశ్ బాబుకు చెందిన జీఎంబీ ఎంటర్‌టైన్‌మెంట్స్ సమర్పణలో ఈ చిత్రం తెరకెక్కింది.

థియేటర్లలో విడుదలైన సమయంలో ఈ సినిమా వైవిధ్యమైన కథాంశం, సత్యదేవ్ బలమైన నటన, సాంకేతిక ప్రమాణాలతో ప్రేక్షకులు, విమర్శకుల నుంచి మంచి స్పందనను సొంతం చేసుకుంది. సత్యదేవ్ ప్రదర్శించిన నటన, దర్శకుడు మలిచిన ఉత్కంఠభరితమైన కథనం ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ఇప్పుడు నెట్‌ఫ్లిక్స్ ద్వారా ఓటీటీలోకి వస్తుండటంతో ఈ సినిమా మరింత ఎక్కువ మంది ప్రేక్షకులకు చేరువ కోబోతోంది.



## 'ఆదర్శ కుటుంబం'లో నివేదా పేతురాజ్.. స్పెషల్ గ్లింప్స్‌తో సర్‌ప్రైజ్ ఇచ్చిన మేకర్స్

విక్టరీ వెంకటేష్, దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'ఆదర్శ కుటుంబం' సినిమాపై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. తాజాగా ఈ చిత్రంలో హీరోయిన్ నివేదా పేతురాజ్ కూడా కీలక పాత్రలో నటిస్తున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ విషయాన్ని వెల్లడిస్తూ విడుదల చేసిన ప్రత్యేక గ్లింప్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరలవుతోంది.

మొదట నివేదా పేతురాజ్ ఈ సినిమాలో స్పెషల్ సాంగ్‌లో కనిపిస్తారనే ప్రచారం జరిగింది. అయితే ఆ వార్తలకు చెక్ పెడుతూ మేకర్స్ విడుదల చేసిన గ్లింప్స్‌లో ఆమె కీలక పాత్ర పోషిస్తున్నట్లు స్పష్టం చేశారు. వీడియోలో వెంకటేశ్ సరదా డైలాగ్‌లతో ఆకట్టుకోగా, నివేదా చిరునవ్వుతో ఎంట్రీ ఇచ్చి ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించారు. గ్లింప్స్‌లో వెంకటేశ్ ఇంటి నుంచి కోపంగా బయటకు వచ్చి, నేటి మహిళలపై సరదాగా వ్యాఖ్యలు చేస్తారు. అదే సమయంలో ఎదురుగా నివేదా పేతురాజ్ నవ్వుతూ కనిపించడంతో, "ఆడది అంటే ఇలా నవ్వాలి" అంటూ తన భార్య గురించి వెంకటేశ్ చెప్పే కామెడీ డైలాగ్ నవ్వులు పూయిస్తుంది. చివర్లో కమెడియన్ సత్య వచ్చి "ఊరుకో నాయనా.. ఇది మన ఆదర్శ కుటుంబం" అని చెప్పడంతో వీడియో ముగుస్తుంది. ఈ చిత్రంలో శ్రీనిధి స్వర్ణ కీలక పాత్రలో నటిస్తున్నారు. గ్లింప్స్‌ను బట్టి చూస్తే నివేదా పేతురాజ్ పాత్రకు కూడా కథలో ప్రత్యేక ప్రాధాన్యం ఉన్నట్లు తెలుస్తోంది. వెంకటేశ్ కెరీర్‌లో ఇది 77వ చిత్రం కాగా, నారా రోహిత్ మరో ముఖ్యమైన పాత్రలో నటిస్తున్నారు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి తమన్ సంగీతం అందిస్తున్నారు. అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా సినిమాను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు.



## అభిమానులతో ప్రత్యేకంగా సమావేశమైన అల్లు అర్జున్.. ఫ్యాన్స్ కు కీలక సూచన!

నెట్టింట సాగే దుష్ప్రచారాలకు దూరంగా ఉండాలని అభిమానులకు బన్నీ హితవు

పాన్ ఇండియా ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హైదరాబాద్‌లో తన అభిమానులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. యూసుఫ్‌గూడలోని శౌర్య భవన్‌లో 'అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్'ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం అత్యంత ఉత్సాహభరితంగా కొనసాగింది. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 600 మందికి పైగా అభిమానులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన బన్నీ... సోషల్ మీడియాలో వ్యక్తమయ్యే అనవసరపు ట్రోల్స్, నెగెటివిటీపై పరోక్షంగా స్పందించారు. నెట్టింట సాగే దుష్ప్రచారాలను, వివాదాలను అస్సలు పట్టించుకోవద్దని అభిమానులకు హితవు పలికారు. సానుకూల ధోరణితో ముందుకెళుతూ, తమ సమయాన్ని, శక్తిని మంచి కార్యాలకే వినియోగించాలని పిలుపునిచ్చారు. అభిమానులు చూపుతున్న అమితమైన ఆప్యాయతకు బన్నీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం వారితో కలిసి గ్రూప్ ఫొటోలు దిగుతూ ఎంతో ఉత్సాహంగా గడిపారు. నెగెటివిటీకి దూరంగా ఉండాలని అల్లు అర్జున్ ఇచ్చిన సందేశానికి సోషల్ మీడియాలోనూ ప్రశంసలు దక్కుతున్నాయి. ఈ సమావేశంతో అభిమానులకు, ఐకాన్ స్టార్‌కు మధ్య ఉన్న అనుబంధం మరింత బలపడింది.

"MANA VISHWAM" vide PRGI Registration No. "TGTEL/26/A4450" Printed by SRI VENKATESWARA PRINTING SOLUTIONS, Published by Nameendla Pramod on behalf of Nameendla Pramod, printed at 11-1/B/42, BPM GREEN LANDS COLONY, PRVATHAPUR, MEDIPALLY MANDAL AND DIVISION, GHMC, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500098 and published at H No 2-96, Geesugonda, Gorrekunta editor Nameendla Pramod. Gmail- manavishwamtelugudaily@gmail.com, Cell- 6305638569